
ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 35.0
కనిష్ఠం 24.0
ANDHRAJYOTHY



ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
ప్రాజెక్టుల నీటిమట్టం	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	548.60 (206.7042)	5,244	62,400
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	641.57 (3.58)	12.73	68.78
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	153.509 (18.70)	8,685	5,000

చికెన్ ధరలు | లైవ్ : రూ.125 | డ్రెస్ : రూ.180 | స్కిన్‌లెస్ : రూ.210



ఏకేబీఆర్ ఎత్తిపోతల పనులు ముమ్మరం

» పీఏపల్లిలో రూ.90కోట్లతో నిర్మాణం » ప్రణాళిక సిద్ధం చేసిన అధికారులు

కృష్ణానది పక్కనే పారుతున్నా సాగునీరు లేక ఇబ్బందులు పడుతున్న రైతుల సమస్యలు పరిష్కరించేందుకు గత ప్రభుత్వం పీఏ.పల్లి మండలంలో రెండు ఎత్తిపోతల పథకాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా ఎస్సీ కాలనీ సమీపంలో నిర్మిస్తున్న అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (ఏకేబీఆర్) లిఫ్ట్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ ఎత్తిపోతల పథకం పనులు దాదాపు 70శాతం పూర్తయ్యాయి.

- (ఆంధ్రజ్యోతి, పెద్దఅడిశర్లపల్లి)

ఏఎమ్మార్పీ ప్రాజెక్టులో భాగమైన అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ఎగువ భాగంలోని ఎస్సీ కాలనీ సమీపంలో అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ఎత్తిపోతల పథకాన్ని నిర్మిస్తున్నారు. రూ.90కోట్ల వ్యయంతో 6,691 ఎకరాలకు సాగునీరు అందించేందుకు వీలుగా అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. రిజర్వాయర్ నుంచి ఎత్తిపోసిన నీటిని పైపులైను ద్వారా 5కిలోమీటర్ల దూరంలోని చిలకమర్రి సమీపంలో ఏర్పాటు చేయనున్న సంపునకు తరలిస్తారు. అక్కడి నుంచి నాలుగు విభాగాలుగా 56 కిలోమీటర్ల వరకు పైప్‌లైన్ ద్వారా నీటిని చెరువులు, కుంటల్లోకి తరలించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. అందుకు సంబంధించిన పంప్ హౌస్ పనులు దాదాపు పూర్తికావొచ్చాయి. పైప్‌లైన్ ఏర్పాటు కూడా 4కిలోమీటర్లు పూర్తయింది. మిగిలిన కిలోమీటర్‌కు సంబంధించి రైతులకు పరిహారం అందకపోవడంతో పనులు నిలిపివేశారు. రైతులకు పరిహారం అందిన వెంటనే సంపు నిర్మాణం, పైప్‌లైన్ పనులు ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు. గ్రావిటీ పైపులు 56 కిలోమీటర్ల పనులకు అనుమతి రాలేదని ఈ పనులు పూర్తయిన వెంటనే వాటి ఏర్పాటును ప్రారంభిస్తామని తెలిపారు. బాలజీనగర్, పీఏపల్లి, సూరేపల్లి, రోళ్లకల్లు, చిలకమర్రి, గుర్రంపోడు మండలంలోని ఆయకట్టు ప్రాంతమైన 2,100 ఎకరాలకు రైతుల నష్టపరిహారం చెల్లింపు విషయంలో జాప్యం జరుగుతుండటంతో ఎత్తిపోతల పనులు ఆలస్యంగా జరుగుతున్నాయి. రైతులకు చెక్కులు అందిన వెంటనే పనులు ప్రారంభించడానికి అధికారులు సిద్ధంగా ఉన్నారు.

అటవీశాఖ అనుమతుల కోసం

నాగార్జునసాగర్ వెనుక జలాల నుంచి నీటిని ఎత్తిపోసే పెద్దగట్టు ఎత్తిపోతల నిర్మాణానికి గత ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ ఎత్తిపోతల పరిధిలో కొంతభాగం అటవీశాఖ భూములు ఉండటంతో అనుమతుల కోసం అటవీ శాఖకు అధికారులకు నివేదిక అందజేశారు. కానీ ఇప్పటి వరకు ఎలాంటి అనుమతులు రాలేదు. దీంతో పెద్దగట్టు ఎత్తిపోతల పనులు ప్రారంభించలేదని అధికారులు చెబుతున్నారు.

పంప్‌హౌస్ నిర్మాణం దాదాపు పూర్తి



ఏఎమ్మార్పీ ప్రాజెక్టులో భాగమైన అక్కంపల్లి బ్యాలెన్సింగ్ ఎగువ భాగంలోని ఎస్సీ కాలనీ సమీపంలో నిర్మిస్తున్న ఏకేబీఆర్ లిఫ్ట్ నిర్మాణంలో భాగంగా పంప్‌హౌస్ నిర్మాణం దాదాపు పూర్తయింది. పైప్‌లైన్ కూడా 4కిలోమీటర్ల వరకు పూర్తయింది. మిగిలిన పనులు కూడా త్వరలోనే పూర్తి చేస్తాం. గ్రావిటీ పనులకు అనుమతి రాలేదు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

- నాగయ్య, ఇరిగేషన్ డీఈ

చెక్కులు ఇచ్చిన తర్వాతే పనులు ప్రారంభించాలి



రైతులకు సమానంగా నష్టపరిహారం అందించాలి. కొందరి రైతులకు ఎక్కువ, మరికొందరికి తక్కువ నష్టపరిహారం అందించేలా అధికారులు నివేదికలు తయారు చేశారు. 5కిలోమీటర్ల పరిధిలో 4ఎకరాల పది గుంటల భూమి పైప్‌లైన్‌లో పోతుంది. రైతులకు అందించే నష్టపరిహారంలో తేడాలు ఉన్నాయి. అందరికీ సమానంగా చెక్కులు అందజేస్తేనే పనులు ప్రారంభించేందుకు అనుమతి ఇస్తాం.

- వంగాల వెంకట్‌రెడ్డి, రైతు, అంగడి పేట

నార్కట్‌పల్లి మార్కెట్‌కు లైన్‌క్లియర్?

» చౌటుప్పల్ మార్కెట్ పరిధిలోని చిట్యాల మండలం తొలగింపు
» చిట్యాల వ్యవసాయ మార్కెట్‌లో వాటి విలీనం
» ఇదే ఫార్ములాతో నార్కట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ ఏర్పాటుకు కసరత్తు


మాండ్రలోని సబ్ మార్కెట్ యార్డు (ఫైల్)

నార్కట్‌పల్లిలో వ్యవసాయ మార్కెట్ కమిటీ త్వరలో ఏర్పాటు కానున్నట్లు సమాచారం. ఇటీవల చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం చేసిన విజ్ఞప్తి మేరకు నార్కట్‌పల్లిలో వ్యవసాయ మార్కెట్ మంజూరుకు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఇచ్చిన హామీ కార్యరూపం దాల్చనుంది. అందుకు సంబంధించిన కసరత్తు మొదలైనట్లు సమాచారం.

- (ఆంధ్రజ్యోతి, నార్కట్‌పల్లి)

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి చిట్యాల మండలానికి చెందిన ఎనిమిది రెవెన్యూ గ్రామాలు చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోకి వెళ్లాయి.చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ పరిధిలో కొనసాగుతున్న ఆ గ్రామాలను తిరిగి చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీలో విలీనం చేసేలా ప్రభుత్వం అధికారికంగా త్వరలో ఉత్తర్వులు జారీ చేయనుంది. ఈ నేపథ్యంలో నార్కట్‌పల్లిలో వ్యవసాయ మార్కెట్ ఏర్పాటుకు లైన్‌క్లియర్ అయినట్లు మండలానికి చెందిన అధికార పార్టీల నేతలు విశ్వసిస్తున్నారు.చిట్యాల మండలానికి చెందిన ఎనిమిది రెవెన్యూ గ్రామాలను చౌటుప్పల్ మార్కెట్ నుంచి తొలగించి చిట్యాల మార్కెట్‌లో విలీనం చేసిన ఫార్ములానే నార్కట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఏర్పాటులో పాటించనున్నట్లు తెలిసింది.

సబ్ మార్కెట్ ప్రారంభం రోజున ప్రకటించే అవకాశం..

మాండ్రలో నిర్మించిన సబ్ మార్కెట్ యార్డు ప్రారంభ సమయంలో నార్కట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ ఏర్పాటుకు సంబంధించిన అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని అధికార పార్టీ నేతలు భావిస్తున్నారు. అందుకు సంబంధించిన సన్నాహాలు మొదలైనట్లు తెలిసింది. వాస్తవానికి నార్కట్‌పల్లిలో వ్యవసాయ మార్కెట్ కమిటీని ఏర్పాటు చేయాలనే డిమాండ్ పెద్దగా లేదు. కానీ, చిట్యాల వ్యవసాయ మార్కెట్ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం రోజున ఇక్కడి నేతలు మాండ్ర సబ్ మార్కెట్ యార్డును ప్రారంభించేందుకు మంత్రిని సమయం అడగాలని ఎమ్మెల్యేను కోరారు. అయితే సబ్ మార్కెట్ యార్డు ఏర్పాటుతో అవస్థాపనా సౌకర్యాలు సమకూరినందున నార్కట్‌పల్లిని సబ్ మార్కెట్‌గా కాకుండా మార్కెట్‌గానే ఏర్పాటు చేయిస్తానని పార్టీ శ్రేణులతో ఎమ్మెల్యే వీరేశం పేర్కొన్నారు.

మార్కెట్ ఏర్పాటైతే

నార్కట్‌పల్లిలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఏర్పాటైతే రైతులకు బహుళ ప్రయోజనాలు ఏర్పడనున్నాయి. ఆరుగాలం శ్రమించి పండించిన పంటలను గిట్టుబాటు ధరకు విక్రయించే వెసులుబాటు ఉంటుంది. ఒకవేళ గిట్టుబాటు ధర లేకుంటే మార్కెట్ యార్డులోనే నిల్వ ఉంచి ధర వచ్చినపుడే విక్రయించుకునే సదుపాయం ఉండనుంది. మండలం మిగతా 8వ పేజీలో...

నాఫ్స్కాబ్ డైరెక్టర్‌గా కుంభం శ్రీనివాస్‌రెడ్డి

సహకార వ్యవస్థలో కీలక భూమికకు అవకాశం



నల్లగొండ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (డీసీసీబీ) చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి నాఫ్స్కాబ్ (నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ స్టేట్ కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్) డైరెక్టర్‌గా నియామకమయ్యారు. ఈ మేరకు శనివారం నాఫ్స్కాబ్ మేనేజింగ్ డైరెక్టర్ బీమా సుబ్రహ్మణ్యం ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ప్రగతి బాటలో పయనింపజేసేలా డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి కృషి చేస్తున్న నేపథ్యంలో ఆయనకు తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం కల్పించారు. ఢిల్లీ కేంద్రంగా ఉండే నాఫ్స్కాబ్ కో-ఆపరేటివ్ బ్యాంకుల నుంచి రైతుల సంక్షేమం కోసం తీసుకునే నిర్ణయాల్లో డీసీసీబీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి జాతీయ స్థాయి డైరెక్టర్‌గా ఇక నుంచి కీలక భూమిక పోషించనున్నారు. మునుగోడు మండలం కల్వకుంట్ల గ్రామానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి మునుగోడు పీఏసీఎస్ చైర్మన్‌గా, ఉమ్మడి నల్లగొండ జిల్లా డీసీసీబీ చైర్మన్‌గా పనిచేస్తుండగా, తాజాగా జాతీయస్థాయిలో నాఫ్స్కాబ్ డైరెక్టర్‌గా నియమించడంపై పాలకవర్గ డైరెక్టర్లతోపాటు, అధికారులు, ఉద్యోగులు, పలువురు ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కుంభం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, తనను నియమించిన మేనేజింగ్ డైరెక్టర్ బీమా సుబ్రహ్మణ్యానికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సీఎల్పీ మాజీ నాయకులు కుందూరు జానారెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రమాదాలు చేస్తే డ్రైవింగ్ లైసెన్స్ రద్దు

రవాణా, బీసీశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

నల్లగొండ టౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పొరపాటుగా ప్రమాదాలు చేస్తే అవసరమైతే డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేసేలా భవిష్యత్తులో చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రవాణా, బీసీశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. వాహనాల వెనకవైపు రిఫ్లెక్టర్ రేడియం స్టిక్కర్లను తప్పనిసరిగా వినియోగించేలా జీవో తీసుకురానున్నామని, అలాగే డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్లను ఏర్పాటుచేసే ఆలోచనలో ఉన్నామని తెలిపారు. శనివారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి జిల్లా కేంద్రం సమీపంలోని దండంపల్లి వద్ద రూ.8కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ, నిర్లక్ష్యంగా వాహనం నడపడం, వాహనం ఫిట్‌నెస్ లేకపోవడం తదితర కారణాలతో ప్రమాదాలు జరుగుతున్నాయని, వీటిని తగ్గించేందుకు ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ ఉపయోగపడుతుందన్నారు. ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్‌లో సాంకేతిక పరికరాల సహాయంతో సుమారు 15 అంశాల్లో వాహన ఫిట్‌నెస్‌ను నిర్ధారిస్తుందని తెలిపారు. రవాణారంగంలో సాంకేతిక విప్లవాన్ని తీసుకురావాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని, అందులో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా ఒక్కోటి రూ.8కోట్ల వ్యయంతో ఆటోమేటెడ్ టెస్టిం గ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు.

స్క్రాపింగ్ పాలసీని తీసుకువచ్చామని, ఏటీసీతో ప్రతీ వాహనం వాహన సారధి పరిధిలోకి వచ్చే విధంగా భాగస్వామ్యం చేశామన్నారు. ట్రాఫిక్ అవేర్నెస్‌లో భాగంగా అవగాహన కార్యక్రమాలు, విద్యార్థులకు క్లబ్‌లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో డ్రైవింగ్ లైసెన్స్ టెస్టులను ఆటోమేటిక్‌గా నిర్వహించేలా చర్యలు తీసుకుంటామన్నారు. పాశ్చాత్య దేశాల మాదిరిగానే ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే జరిమానా విధించడమేగాక, పొరపాటున ప్రమాదం చేసినట్లయితే అవసరమైతే లైసెన్స్ రద్దు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.




నల్లగొండలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్, బస్సు నడుపుతున్న మంత్రి కోమటిరెడ్డి

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణాన్ని 20 నెలల్లో 200కోట్ల మంది మహిళలు వినియోగించుకున్నారన్నారు. నల్లగొండ జిల్లాకు 70 ఎలక్ట్రికల్ బస్సులు మంజూరుకాగా, 10 బస్సులు నార్కెట్‌పల్లికి, మిగతావి ఇతర ప్రాంతాలకు తిప్పనున్నట్లు తెలిపారు. నార్కెట్‌పల్లికి 80 కొత్త బస్సులు కావాలని, నూతన డిపో ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని రవాణాశాఖ మంత్రికి విజ్ఞప్తి చేశారు. అదే విధంగా నల్లగొండ జిల్లా కేంద్రంలో ఎలక్ట్రికల్ బస్సులను మంత్రులు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బస్‌స్టేషన్ నుంచి జిల్లా కోర్టు వరకు స్వయంగా బస్సు నడిపారు. కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, బత్తుల లక్ష్మారెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవర్, జిల్లా ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ శ్రీవాణి, అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్, రవాణాశాఖ కమిషనర్ చంద్రశేఖర్, విశ్రాంత ఆర్టీవో మోహన్‌రెడ్డి, ఆర్టీవో మెంబర్లు రాజిరెడ్డి, రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం


నల్లగొండలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొన్నం, కోమటిరెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్

నల్లగొండ టౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సామాజిక న్యాయం పాటిస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని ఎమ్మెల్సీ, డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించడానికి నిర్ణయం తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేస్తూ శనివారం క్లాక్ టవర్ సెంటర్లో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల ఫ్లెక్సీలకు పాలాభిషేకం నిర్వహించారు. మహాత్మ జ్యోతిబాపూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్‌నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ బడుగు, బలహీన వర్గాల పార్టీ అని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ నిర్ణయం తీసుకోవడం హర్షణీయమన్నారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్, మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, నాయకులు బొజ్జ శంకర్, జూలకంటి శ్రీనివాస్, ఆలకుంట్ల మోహన్‌బాబు, మారగోని నవీన్‌గౌడ్, ఆలకుంట్ల నాగరత్నంరాజు, ఇంతియాజ్, శ్రీనివాస్, ఆమీర్, గంగుల సైదులు, సమద్, కత్తుల కోటి, ఇబ్రహీం, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దాలి

పీఈటీఏ టీఎస్ రాష్ట్ర కార్యదర్శి కృష్ణమూర్తి


నల్లగొండలో సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణమూర్తి

నల్లగొండ స్పోర్ట్స్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడల్లో రాణించేలా తీర్చిదిద్ది క్రీడాభివృద్ధికి దోహదపడాలని పీఈటీఏ టీఎస్ రాష్ట్ర కార్యదర్శి పొన్నగని కృష్ణమూర్తిగౌడ్ అన్నారు. శనివారం నల్లగొండలో జరిగిన పీటీఎస్ఏ టీఎస్ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి అత్యంత ప్రాధ్యానం ఇస్తోందన్నారు. అనంతరం జరిగిన వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశంలో జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా జింగి చంద్రయ్య, ప్రధాన కార్యదర్శిగా తాళ్ల శ్రీనివాస్‌గౌడ్, కోశాధికారిగా ఎం.సత్యనారాయణ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో వ్యాయామ విద్య ఉపాధ్యాయులు వి.రవీందర్, బి.వెంకటరత్నం, సీహెచ్.బ్రహ్మయ్య, శంభు లింగం, మాణిక్యం, సీహెచ్.పుల్లయ్య, కరుణాకర్‌రెడ్డి, లెనిన్, మధుసూదన్, సిద్దు, సూర్యనారాయణ, సుమన్, శివ, తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్‌పై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదు


విలేకరులతో సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్

దేవరకొండ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): బీసీలకు రిజర్వేషన్లు కల్పించడంపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధిలేదని, స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేసేందుకే బీసీ రిజర్వేషన్ల డ్రామా ఆడుతోందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ విమర్శించారు. శనివారం దేవరకొండలో ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో బీహార్, రాజస్థాన్, కేరళ రాష్ట్రాల్లో ఇలాంటి జీవోలు ఇస్తే కోర్టుల్లో నిలబడలేదన్నారు. రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్‌లో పెట్టకుండా రిజర్వేషన్లు ఎలా అమలవుతాయని ఆయన ప్రశ్నించారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో పేర్కొన్న ఏ ఒక్క హామీ కూడా కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. బీసీ రిజర్వేషన్ల బిల్లు ఆమోదం కోసం కేంద్ర ప్రభుత్వంతో ఎలాంటి ప్రయత్నం చేయించలేదన్నారు. బీసీలను మోసం చేసేందుకే కాంగ్రెస్ కుట్రపన్నుతోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం చట్టం చేస్తే బీసీ రిజర్వేషన్లు అమలవుతాయని, సీఎం రేవంత్‌రెడ్డికి తెలిసినా, ఆర్డినెన్స్‌తో బీసీ రిజర్వేషన్లు ఎలా సాధ్యమన్నారు. బీసీల్లో ఉప కులాలకు రిజర్వేషన్లు ఇస్తామన్న హామీ ఏమైందని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలపై కపట ప్రేమ చూపతూ నాటకం ఆడుతోందని, పాలాభిషేకాలు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. బీసీలకు రాష్ట్ర బడ్జెట్‌లో రూ.20వేల కోట్లు కేటాయిస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాయమాటలను బీసీలు నమ్మి మోసపోవద్దని హితవుపలికారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి సరైన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీఆర్ఎస్ దేవరకొండ అధ్యక్షుడు టీవీఎన్.రెడ్డి, గాజుల ఆంజనేయులు, చింతపల్లి సుభాష్‌గౌడ్, వల్లపురెడ్డి, బాలయ్య, జనార్ధన్‌రావు, నీల రవికుమార్, రాజు, కృష్ణ, ఆరేకంటి రాములు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం నుంచి తొలగించారని ఆత్మహత్యాయత్నం

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఘటన 6

ప్రజల కోసం పలు కేంద్ర పథకాలు


నల్లగొండలో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

నల్లగొండ టౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ప్రజల కోసం కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని జాతీయ కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వీరెల్లి చంద్రశేఖర్ అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ 11 ఏళ్ల పాలన పూర్తయిన సందర్భంగా బీజేపీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు మిరియాల వెంకటేశం అధ్యక్షతన శనివారం పలు వార్డుల్లో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో వారు మాట్లాడారు. ప్రధాని మోదీ పలు రైతు సంక్షేమ పథకాలను నేరుగా రైతులకే అందిస్తున్నారని అన్నారు. దేశంలోని 80కోట్ల మందికి ఉచిత రేషన్ బియ్యాన్ని అందజేస్తోందని, ప్రతీ గ్రామంలో రైతు వేదికలు, శ్మశాన వాటికలు, సీసీ రోడ్లు, ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేసి వికసిత భారత్ లక్ష్యంతో ముందుకువెళ్తుందన్నారు. బీజేపీ పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా ప్రతీ కార్యకర్త 11 మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బొజ్జ నాగరాజు, పట్టణ ప్రధాన కార్యదర్శులు మంగళపల్లి కిషన్, కటకం శ్రీధర్, బిపంగి జగ్జీవన్, దొండ ముతేష్, బిపంగి వినోద్, వేమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, దొండ వెంకన్న, పందుల వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

జ్యూట్ బ్యాగులను వినియోగించాలి

దేవరకొండ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ ప్రమాదకరమని, జ్యూట్ బ్యాగులను వినియోగించాలని నాబార్డు జిల్లా అధికారి విజయ్‌కుమార్ అన్నారు. శనివారం నాబార్డు వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా దేవరకొండ మండలం అచ్చమ్మకుంటతండాలో యాక్షన్ ఫర్ రూరల్ డెవెలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ అనర్థాలపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు అంతా కృషి చేయాలన్నారు. రైతులకు నాబార్డు అండగా ఉంటూ రుణాలు మంజూరు చేస్తోందని, రైతు సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. ప్లాస్టిక్ వినియగం వల్ల కలిగే అనర్థాలను తండావాసులకు వివరించి జ్యూట్ బ్యాగులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో యాక్షన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ అధ్యక్షుడు ఖాజాఖైరత్, సభ్యులు కోట్య, శంకర్, ఆల్య, నాబార్డు ప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళలకు ఆధ్యాత్మికతతో పాటు ఆనందాన్ని ఇచ్చే మాసం ఆషాఢం. ఆషాడంలో మహిళలు ఒకవైపు బోనాలు, మరోవైపు గోరింటాకు సంబురాలు జరుపుకుంటారు. బోనాల పండుగను రాజధాని నగరంలో ఆషాఢంలో జరుపుకుంటుండగా, పల్లెల్లో శ్రావణ మాసంలో జరుపుకుంటారు. కాగా గోరింటాకు సంబురాలను మాత్రం అన్ని ప్రాంతాల్లోనూ ఆషాఢంలోనే జరుపుకుంటారు.

గోరింట పండింది

● ఆషాఢంలో గోరింటాకు సంబరాలు

● ఆధ్యాత్మికం, ఆరోగ్యం కలగలిపిన వేడుక

(ఆంధ్రజ్యోతి-మోత్కూరు)

గోరింటాకు అంటే మక్కువ చూపని మహిళలు ఉండరు. పెరిగిన ఆధునికతతో కోన్‌లు అందుబాటులోకి వచ్చినప్పటికీ పల్లెల్లో మహిళలు గోరింట చెట్టు ఆకు తెచ్చుకుని ముద్దగా నూరి పెట్టుకోవడానికే ఇష్టపడతారు.

గోరింటాకు సంప్రదాయ పద్ధతిలో నూరి

వర్షాకాలంలో గ్రామీణ ప్రాంతాల మహిళలు ఎక్కువగా వ్యవసాయ పనులు చేస్తుంటారు. ఎక్కువ సమయం చేతులు, కాళ్లు నీళ్ల, మట్టిలో పెడుతుంటారు. కాళ్లకు, చేతులకు గోరింటాకు పెట్టుకుంటే చర్మ వ్యాధులు సోకవని, గోళ్లు పుచ్చిపోకుండా ఉంటాయని అంటారు. యువతులు గోరింటాకు పెట్టుకుంటే చెయ్యి మందారంలా ఎర్రగా పండితే మంచి భర్త వస్తాడని, ఆకర్షణగా ఉంటుందని, ఈ నేపథ్యంలోనే వివాహాల సందర్భంగా మెహందీ కార్యక్రమం మొదలైందంటున్నారు. వివాహితలైతే కడుపు పండుతుందని, కాపురం చక్కగా ఉంటుందని పెద్దవాళ్లు చెబుతుంటారు. ఈ నమ్మకాల మాట ఎలా ఉన్నా గోరింటాకు శుభానికి చిహ్నంగా చెబుతారు. గోరింటాకుతో ఎర్రగా పండిన చేతులను తోటి వారికి చూపుతూ మురిసిపోతుంటారు. ఆషాఢంలో పలువురు మహిళలు ఒకచోట చేరి గోరింట చెట్టు నుంచి ఆకు సేకరిస్తారు. కొందరు గోరింటాకు మాత్రమే, మరి కొందరు గోరింటాకుతో కొద్దిగా చింతపండు, పెరుగు చేర్చి రోటిలో సంప్రదాయ పద్ధతిలో మెత్తగా నూరుతారు. పాటలు పాడుతూ, ముచ్చట్లు చెప్పుకుంటూ ఒకరికొకరు గోరింటాకు పెట్టుకుంటారు. ఆషాఢంలోనే కాకుండా శుభకార్యాలు, పండుగలు, పెళ్లిళ్ల సందర్భంగా పెట్టుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

గోరింటాకుతో ప్రయోజనాలు

● చర్మవ్యాధుల నుంచి రక్షిస్తుంది

● ఒంట్లో వేడిని తగ్గిస్తుంది

● రోగ నిరోధక శక్తిని పెంచుతుంది

● గోళ్లను ఆరోగ్యంగా ఉంచుతుంది

● గోరింటాకు, చెట్టు వేర్లు, బెరడు, విత్తనాలు అన్నీ ఔషధ గుణాలు కలిగి ఉంటాయని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు.





మోత్కూరులో గోరింటాకు పెట్టుకుని చేతులు చూపుతున్న మహిళలు

గోరింటాకు సౌభాగ్యానికి చిహ్నం



గోరింటాకు సౌభాగ్యానికి చిహ్నం. ఆషాఢంలో కొత్త పెళ్లికూతుళ్లు తమ పుట్టింటికి చేరుకుంటారు. వారు తమ చేతులకు గోరింటాకు పెట్టుకుని, ఎర్రగా పండితే మురిసిపోతారు. చేతి గోళ్లకు గోరింటాకు పెట్టుకోవడం వల్ల కంటికి ఆకర్షణగా కనిపించడంతో పాటు గోళ్లు పుచ్చిపోకుండా ఉంటాయి. గోరింటాకు శరీర వేడిని చల్లబర్చుతుంది. ప్రతి యేటా ఆషాఢంలో కొందరం మహిళం ఒకచోట చేరి గోరింటాకు సంబురాలు నిర్వహించుకుంటాం.

చాడ మంజుల, గృహిణి,
మోత్కూరు

ఇసుక డంప్ చేసిన వ్యక్తిపై కేసు

ఆలేరు రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలించి డంప్ చేసిన వ్యక్తిపై కేసు నమోదైంది. ఆలేరు ఎస్ఎఫ్‌వో కొండల్‌రావు శనివారం తెలిపిన వివరాల ప్రకారం... యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు మండలంలోని కొలనుపాకకు చెందిన మాసుపేట ప్రశాంత్ గ్రామ వాగు నుంచి ఇసుకను తరలించి తన ఇంటి వద్ద డంప్ చేసి విక్రయిస్తున్నాడు. స్థానిక ఆర్ఐ పూర్ణచందర్ విచారణ చేసి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని ఎస్‌హెచ్‌వో కొండల్‌రావు తెలిపారు.

యువతి అదృశ్యం

భువనగిరి రూరల్, జూలై 12(ఆంధ్రజ్యోతి): యువతి అదృశ్యమైంది. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలం బీయన్‌తిమ్మాపూర్ గ్రామంలో శనివారం జరిగింది. గ్రామానికి చెందిన జిన్న శిరీష (25) ఇంట్లో ఎవరూ లేని సమయంలో బయటకు వెళ్లింది. రాత్రి వరకు ఇంటికి తిరిగిరాకపోవడంతో బంధువులు, గ్రామ పరిసరాల్లో గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో భువనగిరి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఆమె సోదరుడు జిన్న విఘ్నేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి రూరల్ ఎస్‌హెచ్‌వో ఎం. అనిల్ కుమార్ తెలిపారు.

పరస్పరం పోలీసులకు ఫిర్యాదులు

భువనగిరి టౌన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రం భువనగిరిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రి, బాధితులు శనివారం పరస్పరం టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. మండలంలోని రాయిగిరికి చెందిన ఓ గర్భిణి నెల వారి పరీక్షల కోసం ఆ ఆసుపత్రికి వెళ్లేది. ఏడు నెలల గర్భిణి అయిన ఆమెకు బుధవారం నొప్పులు రాగా ఆసుపత్రికి వెళ్లింది. దీంతో వైద్యులు పరీక్షలు చేసి హైదరాబాద్‌కు వెళ్లాల్సిందిగా సూచించారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లగా గర్భసంచి జారి గర్భంలోనే శిశువు మృతి చెందినట్లు నిర్ధారించి శస్త్ర చికిత్స ద్వారా తొలగించారు. ఈ మేరకు బాధితురాలి కుటుంబ సభ్యులు ఆసుపత్రి నిర్వాహకులతో శుక్రవారం, శనివారం ఫోన్‌లో మాట్లాడి మీ నిర్లక్ష్యంతోనే గర్భంలోని శిశువు మృతి చెందిందని ఆరోపించారు. ఈ క్రమంలో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో శనివారం పరస్పరం పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. విచారణ చేస్తున్నామని పట్టణ పోలీసులు తెలిపారు.

ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలి

బొమ్మలరామారం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని రాచకొండ కమిషనరేట్ సీపీ జీ సుధీర్‌బాబు అన్నారు. శనివారం యాదాద్రిభువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆయన సందర్శించి, మాట్లాడారు. అర్జీల సత్వర పరిష్కారానికి కృషి చేయాలన్నారు. నేరాలు చేసే వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. పెండింగ్ కేసులు లోక్‌అదాలత్‌లో పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. పాత రికార్డులను, కొత్తరికార్డులను, పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్ సిబ్బంది వ్యవహార శైలి, విధుల విధానంపై ఆరా తీశారు. సీపీ వెంట భువనగిరి డీసీపీ అక్షాంశ్ యాదవ్, భువనగిరి ఏసీపీ రాహుల్‌రెడ్డి ఉన్నారు.



పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తూ సూచనలు చేస్తున్న సుధీర్‌బాబు

ఉద్యోగం నుంచి తొలగించారని ఆత్మహత్యాయత్నం

● నల్లగొండలోని మంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద ఘటన

నల్లగొండ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): అకారణంగా అవుట్ సోర్సింగ్ ఉద్యోగం నుంచి తొలగించడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న ఓ వ్యక్తి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయ ఆవరణలో ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండ పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన మొకిరాల కరుణాకర్ మునిసిపాలిటీ అవుట్‌సోర్సింగ్ విధానంలో లైటింగ్ క్రేన్ డ్రైవర్‌గా పనిచేసేవాడు. అయితే ఏడాది క్రితం కరుణాకర్‌ను అధికారులు విధుల నుంచి తొలగించారు. తనను అకారణంగా తొలగించడంతో కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటోందని మనస్తాపానికి గురయ్యాడు. శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ పలు అభివృద్ధి, శంకుస్థాపన కార్యక్రమాలకు హాజరయ్యారు. ఈ నేపథ్యంలో తన సమస్యను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి విన్నవించుకోవాలని క్యాంపు కార్యాలయానికి చేరుకున్నాడు. మంత్రులు క్యాంపు కార్యాలయానికి రాకుండా నేరుగా నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలంలో జరిగిన కార్యక్రమాలకు హాజరయ్యారు. దీంతో కరుణాకర్ మధ్యాహ్నం 12 గంటల సమయంలో మంత్రి క్యాంపు కార్యాలయానికి వెళ్లి ఒంటిపై డీజిల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. ఆ సమయంలో మంత్రులు క్యాంపు కార్యాలయంలో లేరు. తన సమస్యను పరిష్కరించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసి కోరాలని కరుణాకర్ భావించినట్లు సమాచారం. అయితే మంత్రి అందుబాటులో లేకపోవడంతో తన వెంట తెచ్చుకున్న డీజిల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో పోలీసులు, కాంగ్రెస్ కార్యకర్తలు సకాలంలో స్పందించి ఆత్మహత్యాయత్నాన్ని అడ్డుకోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. అనంతరం కరుణాకర్‌ను నల్లగొండ టూటౌన్ పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కౌన్సిలింగ్ నిర్వహించిన అనంతరం అతడిని కుటుంబసభ్యులకు అప్పగించారు.

గంజాయి విక్రయించే ముగ్గురి అరెస్ట్

సూర్యాపేట క్రైం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : గంజాయిని రవాణా చేసి, విక్రయించే ముగ్గురిని సూర్యాపేట జిల్లా కేంద్ర పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.లక్ష విలువైన నాలుగు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు.నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలం చెర్వుఅన్నారం గ్రామానికి చెందిన గండమళ్ల దుర్గాప్రసాద్, సూర్యాపేటలోని ఇందిరమ్మకాలనీకి చెందిన మహ్మద్ జానీపాష, అదేకాలనీకి చెందిన చెరుకు దీపక్ స్నేహితులు. వీరు గంజాయిని ఇతర రాష్ట్రం నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి సూర్యాపేట, నల్లగొండలో విక్రయించాలనుకున్నారు. అందులో భాగ ంగా ఐదు రోజుల కిందట దుర్గాప్రసాద్, దీపక్ కలిసి బైక్‌పై ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని సీలేరు ప్రాంతానికి వెళ్లి నాలుగు కిలోల గంజాయిని కిలోకు రూ.3వేలకు కొనుగోలుచేశారు. ఆ గంజాయిని సూర్యాపేటలో దుర్గాప్రసాద్ ఇంట్లో భద్రపరిచారు. తెచ్చిన గంజాయిని ముగ్గురు వాటాలుగా పంచుకోవాలని ఈ నెల 11వ తేదీన సాయంత్రం దుర్గాప్రసాద్ ఇంటికి జానీపాష వెళ్లాడు. అక్కడ గంజాయిని భాగాలుగా చేస్తుండగా సమాచారం అందుకున్న పట్టణ పోలీసులు దాడి చేసి సుమారు నాలుగు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా తమతో పాటు దీపక్ కూడా ఉన్నాడని చెప్పడంతో దీపక్‌ను అదుపులోకి తీసుకున్నారు. ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఇన్ స్పెక్టర్ వెంకటయ్య తెలిపారు. సమావేశంలో పట్టణ ఎస్‌ఐలు ఆంజనేయులు, శివతేజ, సిబ్బంది వీరయ్య, శ్రీరాములు, నరేందర్, బజార్, లక్ష్మీనారాయణ, శ్రీను తదితరులు ఉన్నారు.



సమావేశంలో కేసు వివరాలు వెల్లడిస్తున్న పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య

నిషేధిత ఆల్ప్రజోల్ పదార్థం స్వాధీనం, ఒకరి అరెస్ట్

భూదాన్‌పోచంపల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : కల్తీ కల్లు తయారీకి వినియోగించే నిషేధిత ఆల్ప్రజోల్ మత్తు పదార్థాన్ని కలిగి ఉన్న వ్యక్తిని యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలంలో ఎక్సైజ్ బృందం అరెస్ట్ చేసింది. మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల నియంత్రణ చర్యల్లో భాగంగా శుక్రవారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి విష్ణుమూర్తి ఆధ్వర్యంలో భువనగిరి ఎక్సైజ్ బృందం పిలాయిపల్లి గ్రామానికి సిద్దగోని రంగయ్య ఇంటిపై దాడి చేసి కల్తీ కల్లు తయారీకి వినియోగించే నిషేధిత ఆల్ప్రజోల్ మత్తు పదార్థాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా విష్ణుమూర్తి తెలిపిన వివరాల ప్రకారం పిలాయిపల్లి గ్రామానికి చెందిన సిద్దగోని రంగయ్య కల్లులో కలిపే నిషేధిత మత్తు పదార్థం ఆల్ప్రజోలం ను రవాణా చేస్తుండగా మాటువేసి పట్టుకున్నామన్నారు. అతడి నుంచి సుమారు 250 గ్రాముల ఆల్ప్రజోలంను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కాగా రంగయ్యను భువనగిరి స్టేషన్‌లో అప్పగించగా కేసు నమోదు చేసి కోర్టుకు రిమాండ్‌కు పంపించారు. అయితే రంగయ్యకు మత్తు పదార్థం ఆల్ప్రజోలంను రంగ శ్రీనివాస్ అనే వ్యక్తి నుంచి తెచ్చుకున్నానని తెలుపగా రంగ శ్రీనివాస్‌పై కేసు నమోదు చేశారు. ప్రస్తుతం రంగ శ్రీనివాస్ పరారీలో ఉన్నాడని ఎక్సైజ్ శాఖ అధికారి విష్ణుమూర్తి తెలిపారు. ఈ సోదాల్లో పాల్గొన్న ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ నరేందర్ మాట్లాడుతూ భువనగిరి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఎవరైనా అక్రమంగా గంజాయిని, డ్రగ్స్‌ని విక్రయించినా, నిల్వ ఉంచినా, మాదకద్రవ్యాలను, మత్తు పదార్థాలను సేవించినా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.



ఆల్ప్రజోల్ పదార్థంతో పాటు అదుపులోకి తీసుకున్న వ్యక్తితో పోలీసులు

రోడ్డు ప్రమాదంలో పలువురికి తీవ్రగాయాలు

వేములపల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా వేములపల్లి మండలకేంద్రం శివారులోని జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురికి తీవ్రగాయాలయ్యాయి. నార్కట్‌పల్లి- అద్దంకి రహదారిపై శనివారం ఈ ఘటన జరిగింది. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మాడ్గులపల్లి మండలం గుర్రప్పగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని కోయల్‌పహాడ్‌కు చెందిన పందిరి రాంబాబు కొంతకాలంగా పిల్లల చదువు కోసం మిర్యాలగూడలోని సంతోష్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. శని, ఆదివారం పిల్లలకు సెలవులు కావడంతో శనివారం మధ్యాహ్నం సమయంలో భార్య అనిత, పెద్దకుమారుడు అర్షిత్‌కుమార్, చిన్న కుమారుడు అక్షయ్‌కుమార్‌తో కలిసి ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి బయలుదేరాడు. ఈ క్రమంలో వేములపల్లి శివారులోని డ్రీమ్ స్టూడియో సమీపంలోకి చేరుకోగానే వేములపల్లి వైపు నుంచి నల్లగొండ వైపు వెళ్తున్న టిప్పర్ వెనుక నుంచి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో రాంబాబు, అనిత, అక్షయ్‌కుమార్‌కు తీవ్రగాయాలయ్యాయి. దీంతో గాయపడిన వారిని 108వాహనంలో మిర్యాలగూడలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా తీవ్రంగా గాయపడిన అక్షయ్‌కుమార్‌ను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలించారు. రాంబాబు తండ్రి భిక్షం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ డి.వెంకటేశ్వర్లు తెలిపారు.



చికిత్స పొందుతున్న అక్షయ్‌కుమార్

బాలికపై లైంగికదాడి

● జూన్ 28వ ఘటన, ఆలస్యంగా వెలుగులోకి ● పోలీసుల అదుపులో నిందితుడు?

నల్లగొండ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని ఓ గ్రామంలో బాలికపై లైంగికదాడి ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే జూన్ 28వ తేదీన మర్రిగూడ మండలంలోని ఒక గ్రామంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలికపై అదే గ్రామానికి చెందిన యువకుడు లైంగికదాడి చేశాడు. దీంతో బాలికకు కొద్దిరోజులుగా తీవ్రంగా రక్తస్రావం అవుతున్నట్లు సమాచారం. అయితే బాలిక రజస్వరాలైందని తల్లి భావించింది. అయితే ఎన్నిరోజులు అయినా కూడా రక్తస్రావం ఆగకపోవడంతో అనుమానం వచ్చిన తల్లి, కుమార్తెను అసలు విషయం అడిగింది. దీంతో ఘటన విషయాన్ని బాలిక తల్లికి వివరించింది. దీంతో బాలిక తల్లి శనివారం మర్రిగూడ పోలీసులను ఆశ్రయించి సదరు యువకుడిపై ఫిర్యాదుచేసింది. దీంతో పోలీసులు యువకుడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం.

అప్పుల బాధతో మహిళ ఆత్మహత్య

భువనగిరి రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : అప్పుల భారంతో మనస్తాపం చెందిన మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలం చందుపట్ల గ్రామంలో శనివారం జరిగింది. భువనగిరి రూరల్ ఎస్‌హెచ్‌వో అనిల్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన తోటకూరి మల్లమ్మ(62) కుటుంబ అప్పులతో మనోవేదన చెందుతోంది. శనివారం వ్యవసాయ బావి వద్ద క్రిమిసంహారక మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉండగా గమనించిన ఆమె కుమారుడు బాలనర్సింహ తల్లిని భువనగిరి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించాడు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈమేరకు భువనగిరి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో పడి యువకుడు మృతి

కోదాడ రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలో చెరువులో పడి యువకుడు మృతి చెందాడు. ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం కాపుగల్లు గ్రామానికి చెందిన గుగ్గిళ్ల కరుణాకర్(33) ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నాడు. రెండు రోజుల కిందట కరుణాకర్ ఇంటి నుంచి వెళ్లిపోయాడు. శనివారం ఉదయం చెరువులో శవమై తేలాడు. కరుణాకర్ గ్రామ శివారులోని కొండలమ్మ చెరువు వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి పడి ఉండటాన్ని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విషయంపై తండ్రి నర్సింహారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ మల్లయ్య కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కార్మికుడు మృతిపై కేసు నమోదు

చిట్యాల రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : రసాయన పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుడు మృతిపై కేసు నమోదు చేసినట్లు నల్లగొండ జిల్లా చిట్యాల ఏఎస్ఐ వెంకటయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన శిగ్రాయ లోహ్రా(19) మండలంలోని పిట్టంపల్లి శివారులోని ఓ రసాయన పరిశ్రమలో పనిచేస్తున్నాడు. ఈ నెల 8న అతడికి తీవ్ర జ్వరంరావడంతో కార్మికులు చికిత్సకోసం వెలిమినేడులోని ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. ఎంతకూ జ్వరం తగ్గకపోవడంతో మెరుగైన చికిత్స కోసం ఈ నెల 11న రాత్రి పనికల్పించిన కాంట్రాక్టరు లోహ్రాని మెరుగైన చికిత్స నిమిత్తం నార్కట్‌పల్లి కామినేని ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. లోహ్రా చిన్నాన్న కుమారుడు సుక్రాం లోహ్రా ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

ఏడుగురు జూదరుల అరెస్ట్

గరిడేపల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : పేకాటస్థావరంపై దాడి చేసి ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు సూర్యాపేట జిల్లా గరిడేపల్లి ఎస్ఐ నరేష్ తెలిపారు. మండలంలోని అప్పన్నపేట గ్రామశివారులో గుర్రం జాన్‌రెడ్డి ఏనె మీద కొందరు పేకాడుతున్న సమాచారంతో సిబ్బందితో కలిసి దాడి చేసినట్లు ఎస్ఐ తెలిపారు. గ్రామానికి చెందిన ఏదుళ్ల ప్రభాకర్‌రెడ్డి, గుర్రం జాన్‌రెడ్డి, ఏదుళ్ల మోహన్‌రెడ్డి, యర్రగొర్ల వెంకటేశ్వర్లు, ఏ.కృష్ణారెడ్డిలను పట్టుకోగా గుర్రం పిచ్చిరెడ్డి, రవీంద్రాచారి పారిపోయినట్లు ఆయన తెలిపారు. పట్టుకున్న వారి వద్ద నుంచి రూ.2,260, 3 సెల్‌ఫోన్లు, మూడు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉనికి కోసమే దేశాల మధ్య యుద్ధాలు




సమావేశంలో మాట్లాడుతున్న వేణుగోపాల్

సూర్యాపేట అర్బన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : యుద్ధంతో సాధించేదీ ఏదీలేదని, ప్రపంచ దేశాలు కేవలం తమ ఉనికి కోసమే యుద్ధాలు చేస్తున్నాయని వీక్షణం సంపాదకుడు ఎన్.వేణుగోపాల్ అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని ఓ గార్డెన్‌లో నిర్వహించిన వివేక్ వర్ధంతి స్మారకోపన్యాసంలో 'యుద్ధం-శాంతి' అనే అంశంపై ఆయన మాట్లాడారు. నేటి సమాజంలో ప్రజలు శాంతిని కోరుకుంటున్నారని పాలకులు మాత్రం స్వార్థంతో యుద్ధం కోరుకుంటున్నారని తెలిపారు. వివేక్ విద్యార్థి ఉద్యమాల్లో అలుపెరగని పోరాటం చేశారన్నారు. అమెరికా తన ఆధిపత్యం కోసం ఇరాన్‌పై యుద్ధానికి పాల్పడుతోందన్నారు. బీజేపీ ప్రభుత్వం సంఘ్ పరివార్ కనుసన్నల్లో మైనార్టీలు, దళితులు, ఆదివాసీలపై దాడులు చేస్తోందన్నారు. కార్యక్రమంలో యోగానందచారి, మాధవి, రమాదేవి, అంబటి నాగయ్య, ఆవుల నాగరాజు, నల్లెల మాధవరెడ్డి, తంగెళ్ల సుదర్శన్, జీ.కోటయ్య, సోమయ్య, వెంకటేశ్వర్లు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభను అడ్డుకుంటాం

శాలిగౌరారం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): తిరుమలగిరిలో ఈ నెల 14న జరిగే సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభను అడ్డుకుంటామని తెలంగాణ గౌడ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మొల్కపురి శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలకేంద్రంలో సంఘం విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిత్తలూరి కృష్ణమూర్తిగౌడ్‌తో కలిసిన ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో తాటి చెట్ల పైనుంచి పడి మృతి చెందిన గీత కార్మిక కుటుంబాలకు ప్రభుత్వం నుంచి అందాల్సిన రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతేడాది పెండింగ్ ఎక్స్‌గ్రేషియాలు ఇస్తామని మాట ఇచ్చిన సీఎం నేటికీ అందివ్వలేదన్నారు. సమావేశంలో నాయకులు బండపల్లి జానయ్య, మాదగోని నాగయ్య, కృష్ణయ్య, భూపతి వెంకటేశ్వర్లు, ఆకుల రవి, రాములు, నరసింహ, శ్రీను, లోడే అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



శాలిగౌరారంలో మాట్లాడుతున్న శ్రీకాంత్‌గౌడ్, నాయకులు

12డ్రమ్ముల పామాయిల్ పట్టివేత: ఇద్దరిపై కేసు

కేతేపల్లి, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఆయిల్ ట్యాంకర్ల నుంచి అక్రమంగా సేకరించి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న 12డ్రమ్ముల పామాయిల్‌ను నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని చీకటిగూడెం గ్రామంలో పట్టుకున్నారు. ఎస్ఐ సతీష్‌వర్మ తెలిపిన వివరాల ప్రకారం... హైవే మీదుగా హైదరాబాద్ వెళ్లే పామాయిల్ ట్యాంకర్ల నుంచి చీకటిగూడెం గ్రామంలో హైవే వెంట గల ఓ ఇంటి వద్ద వాహన డ్రైవర్లు పామాయిల్‌ను తీసి విక్రయిస్తుంటారు. ఈ వ్యవహారం కొన్నాళ్ళుగా సాగుతోంది. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి పామాయిల్ ట్యాంకర్ల నుంచి పామాయిల్ తీసి తరలిస్తున్నారనే సమాచారంతో ఎస్ఐ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్కడ 12డ్రమ్ములతో గల టాటా గూడ్స్ వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ట్యాంకర్ల నుంచి పామాయిల్‌ను సేకరించి ఇతర ప్రాంతాలకు అధికధరకు విక్రయిస్తున్న కిరణ్, భాస్కర్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయలేదని నిరసన

చిట్యాలరూరల్, జూలై 12(ఆంధ్రజ్యోతి): తమకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ నల్లగొండ జిల్లా చిట్యాల మండలం ఆరెగూడేనికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నిరసన తెలిపారు. తమకు ఇళ్లు లేవని రేకుల ఇళ్లలో నివాసముంటున్నామన్నారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ప్రకటించడంతో ఆశలు చిగురించాయని ఇండ్లను ఇస్తామంటే దరఖాస్తు చేసుకున్నామన్నారు. తాము ఎన్నో ఏళ్ళుగా కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నామని ఇందిరమ్మ ఇళ్ల మంజూరుతో తమకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తంచేశారు. గ్రామంలో 13మందికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యానని, లబ్ధిదారుల ఎంపికలో అవతకతవకలు జరిగాయని ఆరోపించారు. తాము అర్హులైనా కూడా తమను అర్హుల జాబితాలో చేర్చకపోవడం దారుణమన్నారు. కాంగ్రెస్ జెండా మోసిన పార్టీ కార్యకర్తలకే అన్యాయం జరిగిందని తాము ఎవరికి చెప్పుకోవాలన్నారు. తమ గోడును ఎమ్మెల్యే వేముల వీరేశం అర్థం చేసుకుని ఇళ్లను తమకు మంజూరు చేయించాలని విజ్ఞప్తి చేశారు.

భూపంచాయితీ.. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

చింతలపాలెం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండల పరిధిలోని గుడిమల్కాపురానికి చెందిన షేక్ మస్తాన్ పేరిట సర్వే నెంబర్ 226/63లో ఎకరం 20 గుంటల లావుని పట్టా భూమి ఉంది. 22 గుంటలు షేక్ పేరా సాహేబ్‌కు భూమి ఉంది. అదే సర్వే నెంబర్లు గల భూమి పూర్వం నుంచి కబ్జాలో ఉండి పంట పండించుకుంటున్నారు. కొంతకాలంగా షేక్ పేరా సాహేబ్‌కు, షేక్ మస్తాన్‌కు మధ్య గొడవ జరిగింది. మస్తాన్ బాబాయి అయినా పీరుసాహేబ్ గొడవకు దిగాడు. పంచాయితీ పోలీస్ స్టేషన్‌కు చేరింది. మస్తాన్ తన పట్టా పాస్‌బుక్ ఆధారాలతో పీర్ సాహేబ్ భూమి కోసం దౌర్జన్యం చేస్తున్నాడని ఫిర్యాదు చేశాడు. పోలీస్‌స్టేషన్లో భూ పంచాయితీలు చేయమని సివిల్ తగాదా కోర్టులో తేల్చుకోవాలని సదరు ఎస్ఐ సలహా ఇచ్చారు. అయితే శుక్రవారం మస్తాన్ తన బాబాయ్ అయినా పేరా సాహేబ్ కబ్జాలో ఉన్న పత్తి పంటను దున్నడంతో పేరా సాహేబ్ తన అన్న కొడుకైన మస్తాన్‌పై పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా ముందు జాగ్రత్తగా పోలీస్ శాఖ సిబ్బందితో అక్కడి వెళ్లి పంచనామా నిర్వహించారు. షేక్ మస్తాన్ వారికి సంబంధించిన వ్యక్తులను పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. విచారణ చేస్తున్నామని చింతలపాలెం ఎస్ఐ సందీప్‌రెడ్డి తెలిపారు.

నార్కట్‌పల్లి డిపోకు పూర్వవైభవం



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న ధర్మకర్తలు

ఆందోళ్ మైసమ్మ ఉత్సవాలు ప్రారంభం

చౌటుప్పల్‌రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురంలోని శ్రీ ఆందోళ్ మైసమ్మ దేవాలయం బోనాల ఉత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం అఖండ దీపారాధన, గణపతి పూజ, పుణ్యాహవచనం, లలిత సహస్రనామార్చన, ఆరగింపు, హారతి, హోమాలు నిర్వహించారు. అనంతరం పుట్ట బంగారం తీసుకువచ్చి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం బోనాల ఉత్సవాలు జరగనున్నాయి. ఈ కార్యక్రమంలో చైర్మన్ చిల్కూరి మల్లారెడ్డి, ఈవో మోహన్‌బాబు, ధర్మకర్తలు స్వామిగౌడ్, అంజిరెడ్డి, జిట్టంపల్లి జంగయ్య, కంచర్ల ప్రవీణ్ రెడ్డి, యాదమ్మ, మల్లేష్, సోమ రాఘవేందర్‌రెడ్డి, రవీందర్, అశోక్, వెల్లంకి రమేష్ చారి, చేగూరి మహేష్, పరమేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



పుట్టబంగారం తీసుకువస్తున్న చైర్మన్, ఈవో, ధర్మకర్తలు



నార్కట్‌పల్లి ఆర్టీసీ డిపో

- పునరుద్ధరణపై చిగురిస్తున్న ఆశలు
- దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తానని మంత్రి పొన్నం ప్రకటన
- హర్షం వ్యక్తం చేస్తున్న నార్కట్‌పల్లి పట్టణ ప్రజలు
- నేడు డిపో వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యంలో సంబురాలు

నార్కట్‌పల్లి, జూలై 12(ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి ఆర్టీసీ డిపో పూర్వవైభవంపై ఆశలు చిగురించాయి. అసెంబ్లీ ఎన్నికల ప్రచార సభ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం (మహాలక్ష్మి) పథకం ప్రారంభం సందర్భంగా నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఇచ్చిన హామీ కాస్త ఆలస్యమైనా కార్యరూపం దాల్చబోతోంది. ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో నార్కట్‌పల్లి డిపోకు మళ్లీ పూర్వవైభవం రాబోతుంది. నార్కట్‌పల్లి ఆర్టీసీ డిపోను దత్తత తీసుకుని బస్సుల సంఖ్యను పెంచడం ద్వారా పూర్వవైభవానికి కృషి చేస్తానని రోడ్డు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నల్లగొండలో ఎలక్ట్రికల్ బస్సులను ప్రారంభించిన సందర్భంగా జరిగిన సమావేశంలో స్వయంగా ప్రకటించారు. దీంతో నార్కట్‌పల్లి ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఎమ్మెల్యేకు కృతజ్ఞత తెలిపేలా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం నార్కట్‌పల్లి డిపో వద్ద వీరేశం చిత్రపటానికి క్షీరాభిషేకం, మిఠాయిల పంపిణీ వంటి సంబురాలకు సిద్ధమవుతున్నారు.

సుదీర్ఘ చరిత్ర కలిగిన డిపో

రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో చారిత్రక నేపథ్యం కలిగిన నార్కట్‌పల్లి ఆర్టీసీ డిపో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై జిల్లా కేంద్రానికి జంక్షన్‌గా ఉన్న నార్కట్‌పల్లిలో నిజాం కాలంలో ఏర్పాటైంది. 1932లో నిజాం స్టేట్ రైల్వే ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ (ఎన్ఎస్ఆర్‌టీడీ)లో భాగంగా తెలంగాణ ప్రాంతంలో నిజాం పాలకులు తమ రవాణా అవసరాలు తీర్చుకోవడం కోసం 2 డిపోలను ఏర్పాటు చేశారు. అందులో ఒకటి హైదరాబాద్ కాగా రెండో డిపోగా నార్కట్‌పల్లి చరిత్రకెక్కింది. 90 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన ఈ డిపో తన ప్రస్థానంలో ఎన్నో రికార్డులను నమోదు చేసుకుంది. ఒకనాడు సుమారు 70 బస్సులతో కొనసాగిన ఈ డిపో ప్రస్తుతం ఆర్టీసీ సర్వీసులు, 10 అద్దె బస్సులతో శాటిలైట్ డిపోగా నల్లగొండ డీఎం ఇన్‌చార్జి పర్యవేక్షణలో కొనసాగుతోంది.

మూసివేతను అడ్డుకున్న కోమటిరెడ్డి

రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో డిపోను మూసివేసే ప్రతిపాదనలను ఆర్టీసీ ఉన్నతాధికారులు తెచ్చారు. వైఎస్‌కు సన్నిహితంగా ఉన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఒత్తిడితో డిపో మూసివేత అప్పట్లో ఆగిపోయింది. తర్వాత బీఆర్ఎస్ హయాంలో కూడా డిపోను ఎత్తివేసేందుకు ప్రయత్నాలు జరిగాయి. అప్పటి ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య చొరవతో సర్వీసుల సంఖ్య కుదింపుతో నిలిచింది. కానీ గడిచిన పదేళ్ల కాలంలో డిపో నష్టాల బాట పట్టింది. పెద్ద చెట్టు కింద చిన్న చెట్టు అనే తరహాలో నల్లగొండ జిల్లా కేంద్రానికి దగ్గరలో ఉండటమే ఈ డిపోకు పెద్ద నష్టంగా పరిణమించింది. నల్లగొండ డిపోను బలోపేతం చేసే ఆలోచనలో భాగంగానే నార్కట్‌పల్లి డిపో ఆదాయ మార్గాలను ఉద్దేశపూర్వకంగా మూసివేసి నష్టాల బాట పట్టించారన్న ఆరోపణలు అప్పట్లో బలంగా వినిపించాయి.

చరిత్ర తిరగ రాసేనా

తాజాగా ఎమ్మెల్యే వేముల వీరేశం చొరవతో నార్కట్‌పల్లి డిపోను దత్తత తీసుకుని బస్సుల సంఖ్యను పెంచి పూర్వవైభవానికి కృషి చేస్తానని మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన ప్రకటన ఆశలు రేపింది. ఎత్తివేస్తే చరిత్రలో కలవాల్సిన డిపో పుంజుకుని చరిత్ర తిరగ రాసేనా అనే ఆశాభావం వ్యక్తమవుతోంది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకంతో ఆర్టీసీలో ఓఆర్ (ఆక్యుపెన్సీ రేషియో) అమాంతం పెరిగింది. దీంతో బస్సుల సంఖ్య కూడా ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా పెంచాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. దీంతో నార్కట్‌పల్లి డిపో ఎత్తివేత జాబితా నుంచి తొలగి జీవం పోసుకోవడంతో చరిత్ర తిరగరాస్తుందనే ఆశాభావంతో ప్రజలు ఉన్నారు.

మంత్రులు, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు



నార్కట్‌పల్లి ఆర్టీసీ డిపోను దత్తత తీసుకుని పూర్వవైభవం తెస్తానన్న మంత్రి పొన్నం ప్రకటన నార్కట్‌పల్లి పట్టణ ప్రజల్లో కొంత ఉత్సాహాన్ని నింపింది. నార్కట్‌పల్లి పట్టణ అభివృద్ధికి బీజం వేసిన డిపో ఎత్తివేత దశ నుండి పూర్వవైభవం వైపుగా అడుగులు వేసేందుకు కృషి చేసిన మంత్రులు పొన్నం ప్రభాకర్, వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే వీరేశంకు కృతజ్ఞతలు.

- జెర్రిపోతుల భరత్‌గౌడ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు, నార్కట్‌పల్లి

సీపీఐ సీనియర్ నాయకుడు నారాయణరావు మృతి

- నారాయణరావు ఆదర్శప్రాయుడు : సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ
- మృతికి పార్టీలకతీతంగా నివాళులు
- అంతిమయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే పద్మావతి



నారాయణరావు (ఫైల్‌ఫొటో)

కోదాడ, జూలై 12(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాటం యోధుడు, సీపీఐ సీనియర్ నాయకుడు దొడ్డా నారాయణరావు మృతి పార్టీకి తీరని లోటని, నారాయణరావు నేటి యువతకు ఆదర్శప్రాయుడని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. శుక్రవారం రాత్రి సీపీఐ సీనియర్ నాయకుడు దొడ్డా నారాయణరావు (96) చిలుకూరులో మృతిచెందారు. శనివారం మధ్యాహ్నం జరిగిన ఆయన అంతిమయాత్రలో సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ పాల్గొని మాట్లాడారు. తెలంగాణ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించిన మహోన్నత వ్యక్తి, ప్రజానాయకుడిగా, సీపీఐ నాయకుడిగా ప్రజల గుండెలో చెరగని ముద్ర వేసుకున్నాడని అన్నారు. అలాంటి వ్యక్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. రజాకార్లకు, పెత్తందార్లకు వ్యతిరేకంగా పోరాటం చేశారని గుర్తు చేశారు. అంతేకాక సారా ఉద్యమంలో కీలక పాత్ర పోషించటంతో పాటు, గ్రంథాలయ ఏర్పాటుకు చదువు, వెలుగులో పాల్గొని తనదైన ముద్ర వేశారని అన్నారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటు అన్నారు. సీపీఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ నారాయణరావు మృతి పార్టీకి తీరని లోటు అన్నారు. ఎన్నో ఏళ్లు పార్టీ బలోపేతానికి కృషి చేసిన మహా మనిషి దొడ్డా అని కొనియాడారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పార్టీ బలోపేతంతో నారాయణరావు తనదైన శైలిలో ముద్ర వేసుకున్నారని అన్నారు. అంతకుముందు నాయకులు నారాయణరావు గృహంలో నారాయణరావు మృతదేహంపై పార్టీలకతీతంగా పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అంతిమయాత్రలో పార్టీలకతీతంగా గ్రామస్థులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అంతిమయాత్రలో పాల్గొని నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ సత్యం, ఎమ్మెల్యే పద్మావతిఉత్తమ్‌కుమార్‌రెడ్డి

పాడె మోసిన నారాయణ

దొడ్డా నారాయణరావు పాడెను సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ మోశారు. ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అంతిమయాత్రలో పాల్గొని మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నారాయణరావు లాంటి మహోన్నత వ్యక్తులను ఆదర్శంగా తీసుకొని ప్రజలు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

నివాళులర్పించిన ప్రముఖులు

దొడ్డా నారాయణరావు మృతి పట్ల మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు వేనేపల్లి చందర్‌రావు, బొల్లం మల్లయ్యయాదవ్, యాదగిరిరావు, జూలకంటి రంగారెడ్డి, సీపీఐ పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యులు పశ్య పద్మ, వనజ, గన్నా చంద్రశేఖర్, బొమ్మగాని ప్రభాకర్, డీసీసీబీ మాజీ చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు, కోదాడ మాజీ సర్పంచ్ యర్నేనిబాబు, పీసీసీ డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, బెజవాడ వెంకటేశ్వర్లు, శ్రీరాములు, పల్లా నర్సింహారెడ్డి, సృజన, కొండయ్య, కొండలుతో పాటు పలువురు మాజీ జడ్పీటీసీలు, ప్రజా ప్రతినిధులు, వైద్యులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

యాదగిరిక్షేత్రంలో భక్తుల కోలాహలం

- స్వామికి సంప్రదాయ నిత్య పూజలు
- స్వామివారి సేవలో ప్రముఖులు


యాదగిరిగుట్టరూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో శనివారం భక్తజనుల ప్రత్యేక పూజల సందడి నెలకొంది. రెండో శనివారం సెలవు రోజు కావడంతో యాత్రాజనులు అధిక సంఖ్యలో క్షేత్ర సందర్శనకు తరలివచ్చారు. ఇష్టదైవాన్ని దర్శించుకునేందుకు ధర్మదర్శనాల్లో 2గంటలు, ప్రత్యేక దర్శనాల్లో గంట సమయం పట్టినట్లు భక్తులు తెలిపారు. సుమారు 25 వేల మందికి పైగా యాదగిరిక్షేత్రాన్ని సందర్శించినట్లు దేవస్థాన అధికారులు తెలిపారు. కొండకింద అనుబంధ పాతగుట్ట ఆలయంలోనూ భక్తుల రద్దీ కొనసాగింది. పాతగుట్ట ఆలయంలో స్వయంభువులను దర్శించుకున్న యాత్రాజనులు ఆలయ ఆవరణలో పిల్లాపాపలతో సేదతీరారు. యాదగిరీశుడికి శనివారం నిత్యవిధి కైంకర్యాలు సంప్రదాయరీతిలో కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.31,99,413 ఆదాయం సమకూరినట్లు దేవస్థాన ఈవో వెంకట్రావుతెలిపారు.

స్వామివారి సేవలో ప్రముఖులు

యాదగిరివాసుడిని శనివారం రాష్ట్ర సమాచార హక్కు చట్టం చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. క్షేత్రసందర్శనకు విచ్చేసిన వీరికి అర్చకులు సంప్రదాయరీతిలో స్వాగతం పలికారు. పూజల అనంతరం వారికి అర్చకులు ఆశీర్వచనం చేయగా, దేవస్థానం ఉప కార్యనిర్వహణాధికారి భాస్కర్‌శర్మ దంపతులకు ప్రసాదం అందజేసి స్వామివారి ప్రతిమను బహూకరించారు.



స్వామివారి కల్యాణోత్సవంలో పట్టుబట్టలు సమర్పిస్తున్న అర్చకులు, కల్యాణానికి హాజరైన భక్తులు



శంకు చక్రం, నామముల నమూనాలు

కొండపై శంకు, చక్రం, నామం పునరుద్ధరణ

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి కొండపైన భక్తులు తిలకించడానికి ఏర్పాటు చేసిన స్వామివారి శంకు, చక్రం, నామములు పునరుద్ధరించనున్నట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎస్. వెంకట్రావు తెలిపారు.

శనివారం తమ కార్యాలయంలో ప్రధానార్చకులు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, దేవాదాయశాఖ స్తపతి, అనువంశిక ధర్మకర్త భాస్కరాయని నరసింహమూర్తితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శంకు, చక్రం, నామములకు సంబంధించిన పనులను సత్వరమే చేపట్టి త్వరితగతిన చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలిసింది.

15న స్వామివారి హుండీల లెక్కింపు

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి హుండీల లెక్కింపు ఈ నెల 15వ తేదీన మంగళవారం ఉదయం 7 గంటలకు కొండకింద వ్రత మండపం హాల్ నెంబర్‌లో లెక్కించనున్నట్లు దేవస్థానం ఉప కార్యనిర్వహణాధికారి దోర్బల భాస్కర్‌శర్మ తెలిపారు. లెక్కింపు కేటాయించిన సంబంధించిన సిబ్బంది సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

పక్కా భవన నిర్మాణాలకు నిధులు

- మంత్రి పొన్నం ప్రభాకర్

నల్లగొండ (కలెక్టరేట్), జూలై 12 (ఆంధ్రజ్యోతి): అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న బీసీ సంక్షేమ వసతిగృహాలు, మహాత్మాజ్యోతిబాపూలే పాఠశాలలకు స్థల సేకరణ చేస్తే భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని ఉదయాదిత్య భవన్‌లో శనివారం నిర్వహించిన ఉమ్మడి నల్లగొండ జిల్లా సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న గురుకుల పాఠశాలలు, కళాశాలలు, సంక్షేమ హాస్టళ్ల భవనాల నిర్మాణానికి జిల్లాల వారీగా స్థల సేకరణ చేసి ప్రతిపాదనలు పంపించాలని కలెక్టర్లను ఆదేశించారు. నల్లగొండ జిల్లాలో 32 బీసీ సంక్షేమ పాఠశాలలు, కళాశాలలు, సంక్షేమ వసతి గృహాలు ఉండగా సుమారు 30అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయని, వీటన్నింటికి పక్కా భవనాలు నిర్మించేందుకు వెంటనే స్థలాలు చూసి ప్రతిపాదనలు పంపించాలన్నారు. కులవృత్తులను కాపాడటంలో భాగంగా ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 40 లక్షల ఈత చెట్లు, 5లక్షల తాటి చెట్లను నాటడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. అలాగే కాటమయ్య రక్షణ కిట్లను ఉమ్మడినల్లగొండ జిల్లాలో వీలైనంత ఎక్కువ మందికి ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రహదారి భద్రతలో భాగంగా ఉమ్మడి జిల్లాలో మంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేరుందని, వాటిని కొనసాగిస్తూనే అన్ని పాఠశాలలు, కళాశాలల్లో రోడ్డు భద్రత క్లబ్బులను ఏర్పాటు చేయాలన్నారు. మహాలక్ష్మి ప్రారంభించిన తర్వాత ఉచిత బస్సు సౌకర్యం కింద 195కోట్ల మంది మహిళలు 6500కోట్ల రూపాయల విలువైన ఉచిత ప్రయాణం చేశారని తెలిపారు. ఆర్టీసీలో 3035 కొత్త ఉద్యోగాలు ఇచ్చామని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో కాలుష్యం తగ్గించేందుకు ఎలక్ట్రికల్ బస్సులను నడుపుతున్నామని, త్వరలోనే 2800 బస్సులు హైదరాబాద్‌లో తిరిగే ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. జిల్లాకు 77 ఈవీ బస్సులను మంజూరు చేయగా, శనివారం సుమారు 40బస్సులను ప్రారంభించినట్లు తెలిపారు. నిజాం కాలం నాటి నార్కట్‌పల్లి బస్ డిపోను దత్తత తీసుకొని డిపోకు పూర్వ వైభవం తీసుకొస్తామని, వారం, పది రోజుల్లో రూటింగ్‌ను సెట్ చేస్తామని తెలిపారు. రోడ్డు భద్రతలో భాగంగా ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘిస్తే శాశ్వతంగా డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేసే నిర్ణయం తీసుకున్నామని, ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టులు చేయనున్నట్లు తెలిపారు. జిల్లా అటవీశాఖ, డీఆర్‌డీవో, బీసీ సంక్షేమ శాఖలు సంయుక్తంగా ప్రభుత్వ స్థలాలను గుర్తించి ఈత, తాటివనాలను పెంచాలని తెలిపారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ నల్లగొండ, మిర్యాలగూడ, నార్కట్‌పల్లి బస్సులను పెంచాలని, బీసీ సంక్షేమ హాస్టళ్లు, భవనాల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని అన్నారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా అమలు చేసేలా చూడాలని, ముఖ్యంగా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. దండుమల్కాపూర్‌లోని ఫిట్‌నెస్ సెంటర్‌ను ఉపయోగంలోకి తీసుకురావాలని అన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్, చిత్రంలో మంత్రి వెంకట్‌రెడ్డి, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డి, కలెక్టర్లు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు

నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ బీసీ సంక్షేమ హాస్టల్, ప్రభుత్వ భవనాలను ఇవ్వాలని, దీనివల్ల అద్దె బాధ తప్పుతుందని అన్నా రు. ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి మాట్లాడుతూ నాగార్జునసాగర్ డిగ్రీ కళాశాల భవనం మార్చాలని, బీసీ సంక్షేమ హాస్టల్‌కు మరమ్మతులు చేయించాలని కోరారు. మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ తన నియోజకవర్గంలో పాత రోడ్లలోని పలు బస్సులను రద్దు చేశారని, వాటిని పునరుద్ధరించాలని అన్నారు. మిర్యాలగూడలోని బీసీ సంక్షేమ హాస్టల్‌ను మార్చాలని కోరారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ నకిరేకల్ నియోజకవర్గంలో బస్సులు పెంచాలని అన్నారు. ముంబై, చిట్యాల బస్సును పునరుద్ధరించాలని, కేతేపల్లి మండలం మూసీ గురుకుల పాఠశాల భవన నిర్మాణాన్ని పూర్తిచేయాలని కోరారు. ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ రవాణా, బీసీ సంక్షేమ వసతి గృహాల విషయంలో జిల్లాకు ప్రాధాన్యమివ్వాలని కోరారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ జిల్లాలో రహదారి భద్రతలో భాగంగా డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షల శిబిరాన్ని నిర్వహించామని తెలిపారు. మారుమూల ప్రాంతాలకు ప్రత్యేక రూట్లను ఏర్పాటు చేయనున్నామని, ఈ ఏడాది ఈత ప్లాంటేషన్‌పై ఎక్కువ దృష్టి కేంద్రీకరిస్తున్నామన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ బస్సుల నిర్వహణ, కాటమయ్య రక్షణ కిట్లు, బీసీ సంక్షేమ వసతిగృహాలు, గురుకుల పాఠశాలల గురించి వివరించారు. నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్ రహదారి భద్రతపై తెలియజేయగా, జిల్లా ట్రాన్స్‌పోర్ట్ ఉప కమిషనర్ వాణి తమ శాఖ ద్వారా చేపట్టే కార్యక్రమాలను తెలియజేశారు. ఈ సమీక్షా సమావేశంలో మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్, రవాణా శాఖ కమిషనర్ చంద్రశేఖర్‌గౌడ్, జిల్లా అటవీశాఖ అధికారి రాజశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులు గీత కార్మికులకు కాటమయ్య రక్షణకిట్లను పంపిణీ చేశారు. అంతకుముందు మంత్రులు, శాసనమండలి చైర్మన్, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో వనమహోత్సవం కింద మొక్కలను నాటారు.

అభివృద్ధి పనుల ప్రారంభం

తిప్పర్తి, మాడ్గులపల్లి: నల్లగొండ జిల్లా తిప్పర్తి, మాడ్గులపల్లి మండలాల్లో పలు అభివృద్ధి పనులను మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి ప్రారంభించారు. తిప్పర్తి కేంద్రంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో నూతనంగా నిర్మించిన అదనపు సమావేశపు హాల్‌ను ప్రారంభించారు. అనంతరం ఆస్పత్రి ఆవరణలో మొక్కలు నాటారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని సూచించారు.

మాడ్గులపల్లి మండల కేంద్రంలో రూ.30లక్షలతో నిర్మించిన గ్రామపంచాయతీ కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. మండల కేంద్రంలో రూ.14కోట్లతో సమీకృత భవనాలకు భూమి పూజ చేశారు. ప్రజా ప్రభుత్వంలోనే పేదలకు న్యాయం జరుగుతుందని మంత్రులు అన్నారు. పేదలకు సన్నబియ్యాన్ని పంపిణీ చేసి పేదల పక్షపాతిగా నిలిచామన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కుతుందని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, వేముల వీరేశం, తహసీల్దార్లు పరశురాం, సురేష్‌కుమార్, ఎంపీడీవోలు పి.వెంకటేశ్వరెడ్డి, తిరుమలస్వామి, నాయకులు మాజీ జడ్పీటీసీలు పాశం రాంరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, పుల్లెంల సైదులు, నాయకులు పురుషోత్తంరెడ్డి, ఏపీఎం చంద్రశేఖర్, శ్యాంసుందర్, లింగారావు పాల్గొన్నారు.



కాటమయ్య కిట్లను అందజేస్తున్న మంత్రులు

ఆయిల్‌ఫాం సాగును 50 వేల ఎకరాలకు పెంచాలి : మంత్రి వెంకట్‌రెడ్డి



నల్లగొండ, జూలై 12(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లాలో ఆయిల్‌ఫాం సాగును 50వేల ఎకరాలకు పెంచాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టర్ చాంబర్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వరికి ప్రత్యామ్నాయంగా అధి క ఆదాయం ఇచ్చే ఆయిల్‌ఫాం, ఇతర ఉద్యానవన పంటల సాగును ప్రోత్సహించాలని సూచించారు. గంట కు 100 టన్నుల సామర్థ్యం కలిగిన ఆయిల్‌ఫాం ఫ్యాక్టరీని సత్వరమే యుద్ధ ప్రాతిపాదికన నిర్మించి వచ్చే ఆగస్టు మాసంలో ప్రారంభించాలన్నారు. నీటి వసతులు ఉన్న రైతులందరూ ఆయిల్‌ఫాం సాగు చేయాలన్నారు. ప్రభుత్వం ఈ పంటలకు రాయితీతో పాటు మార్కెటింగ్ వసతి కల్పిస్తుందని తెలిపారు. సమావేశంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారి పిన్నపురెడ్డి అనంతరెడ్డి, పతంజలి డీజీఎం యాదగిరి, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పచ్చిబయలు కాదు.. పంట కాల్వ

- పిలాయిపల్లి కాల్వలో గుర్రపు డెక్క ఆకు

భూదాన్‌పోచంపల్లి, జూలై 12(ఆంధ్రజ్యోతి): పచ్చగా కనువిందు చేస్తున్న ఈ ఫొటో చూసి ఏదో పంట అనుకుంటే పొరపాటే. ఇది భూదాన్‌పోచంపల్లి మండలంలోని పిలాయిపల్లి కాల్వలోకి ఏపుగా పెరిగిన గుర్రపుడెక్కాకు చేరింది. క్రమంగా అది కాల్వ పొడవునా విస్తరిస్తోంది. కాల్వలో ఏపుగా పెరిగిన గుర్రపుడెక్కాకు కల్వర్టుల వద్ద నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారింది. దీంతో రైతులకు సాగునీరు అందడంలో ఇబ్బంది కలుగుతుందని ఆయకట్టు రైతులు వాపోతున్నారు. రైతులకు పంట పొలాలకు అందే సాగునీరు గుర్రపుడెక్కాకు నిండి ఉండటంతో పంట పొలాల్లో సైతం గుర్రపుడెక్కాకు విస్తరించే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి గుర్రపు డెక్క ఆకును తొలగించాలని రైతులు కోరుతున్నారు.



భూదాన్‌పోచంపల్లిలో పిలాయిపల్లి కాల్వలో ఏపుగా పెరిగిన గుర్రపుడెక్క ఆకు

సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభను విజయవంతం చేయాలి

శాలిగౌరారం, జూలై 12(ఆంధ్రజ్యోతి): నూతన రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 14వ తేదీన తిరుమలగిరిలో నిర్వహించనున్న సీఎం బహిరంగ సభను విజయవంతం చేయాలని నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పోల్దాస్ నరేష్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

శివలీలారెడ్డికి మహాత్మాగాంధీ శాంతి సేవా అవార్డు

కనగల్, జూలై 12(ఆంధ్రజ్యోతి): కనగల్ గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వైద్యురాలు, సామాజిక సేవా కార్యకర్త కంబాల శివలీలారెడ్డికి మహాత్మాగాంధీ శాంతి సేవ నేషనల్ అవార్డును అందుకున్నారు. హైదరాబాద్ త్యాగరాయ గాన సభలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మనం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె అవార్డు అందజేశారు. కార్యక్రమంలో సినీనటుడు రాజేంద్రకుమార్, డాక్టర్ చక్రవర్తి నల్లపరాజు, సింగర్ అర్చన తదితరులు పాల్గొన్నారు.

గుర్రపు డెక్కతో ఇక్కట్లు

- జాలకుంట చెరువునిండా గుర్రపు డెక్క
- సాగునీటి సరఫరాకు అడ్డంకి

నార్కట్‌పల్లి, జూలై 12(ఆంధ్రజ్యోతి): అసలే అంతంత మాత్రం సాగునీటితో వ్యవసాయం చేస్తున్న రైతులకు గుర్రపుడెక్క రూపంలో నీటి కొరత ఏర్పడుతోంది. చెరువులు, కాల్వల్లో విస్తారంగా వ్యాపించి సాగునీరు పంట పొలాలకు చేరకుండా అడ్డుపడుతోంది. చెరువు తూముల వద్ద నిండా పెరిగి నీటి మళ్లింపునకు ఆటంకం ఏర్పడుతోంది. సకాలంలో కాల్వ నీటి విడుదల కాక ఒకవేళ నీటి విడుదల జరిగినా సరిపోను నీరందక వచ్చిన కొంత నీటినైనా పొలాలకు చేరుద్దామనుకుంటే రైతులకు గుర్రపుడెక్క ఇబ్బంది పెడుతోంది. నార్కట్‌పల్లి మండలంలోని అమ్మనబోలులో మూసీ రాచకాల్వతో పాటు జాల చెరువులో గుర్రపుడెక్క ఏపుగా పెరిగిం ది.ప్రస్తుతం వానాకాలం సీజన్ ప్రారంభమవడంతో రైతులు ఇప్పుడిప్పుడే నాట్లను ప్రారంభించారు. యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని పల్లివాడ నుంచి శాలిగౌరారం ప్రాజెక్టుకు నీటిని తరలించే మూసీ రాచకాల్వ ఉంది. అమ్మనబోలు మీదుగా వెళ్లే ఈ మూసీ రాచకాల్వపై ఆధారపడి సుమారు 600 మంది రైతులు వ్యవసాయం చేస్తున్నారు. అసలే అంతంత మాత్రంగా విడుదల చేస్తున్న నీటిలో కొంతైనా వాడుకుందామంటే గుర్రపు డెక్క అడ్డం వచ్చి నీటిని ముందుకు పోనివ్వడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటిపారుదల శాఖ అధికారులు స్పం దించి గుర్రపు డెక్కను తొలగించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



అమ్మనబోలు జాలకుంట చెర్వునిండా విస్తారంగా పెరిగిన గుర్రపుడెక్క

రూ.13 లక్షలతో అంచనాలు పంపాం



అమ్మనబోలు జాలకుంట చెరువు, రాచకాల్వల్లో దట్టంగా పెరిగిన గుర్రపుడెక్క తొలగింపునకు రూ.13 లక్షలతో అంచనా ప్రతిపాదనలు తయారు చేసి రెండు నెలల క్రితమే డిపార్ట్‌మెంట్‌కు పంపాం. నీటిపారుదల శాఖ ప్రతీనెలా నిర్వహించే ఆపరేషన్ అండ్ మెయింటనెన్స్ సమావేశంలో ఆమో దం పొంది మంజూరు కావాల్సి ఉంది. నిధులు మంజూరు కాగానే ఏజెన్సీ ద్వారా గుర్రపు డెక్కను ప్రతీ క్రాప్‌కు కనీసం రెండు సార్లయినా తగ్గకుండా తొలగింపజేస్తాం. రైతులకు కాల్వ ద్వారా సాగునీరందేలా ప్రయత్నం చేస్తాం.

\- సత్యనారాయణ, డీఈఈ

గుర్రపుడెక్కతో కట్టకు ప్రమాదం



గుర్రపుడెక్కతో జాలకుంట చెరువు కట్టకు ప్రమాదంపొంచి ఉంది. ప్రస్తుతం చెరువులో ఉన్న నీటిపై గుర్రపుడెక్క విస్తారంగా ముంచేసింది. తూముల నుంచి నీరు బయటికి వెళ్లకుండా మూసేసింది. రైతులు శ్రమదానం చేసినా తొలగించలేనంతగా ఉంది. భారీ వర్షాలు కురిసి జాలకుంట చెరువులోకి నీరుచేరితే కట్ట తెగే ప్రమాదం లేకపోలేదు. చెరువులు, కాల్వలను పర్యవేక్షించే సిబ్బంది ఎవరూ లేరు. అధికారులు స్పందించి గుర్రపుడెక్క తొలగించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలి.

\- చిట్టెడి జాన్‌రెడ్డి, రైతు

కాల్వల్లో నీరు రాక మోటార్లు తేలుతున్నాయి



గుర్రపు డెక్క అడ్డుపడుతుండటంతో కాల్వల్లో సరిగా నీరు పారడం లేదు. అమ్మనబోలులోని రాచకాల్వ గేట్ల బ్రిడ్జి వద్ద గుర్రపుడెక్క అడ్డుపడి సరిగా కాల్వలో నీరు ముందుకు పోవడం లేదు. దీంతో కాల్వలో నీరు సమృద్ధిగా రాక మోటార్లు నీటిలో తేలుతున్నాయి. వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో నాట్లు ప్రారంభించాం. కాల్వతో పాటు జాలకుంట చెర్వు ఆయకట్టు కింద నాకున్న పదెకరాల్లో వరినాట్లు వేశా. కానీ సరిగ్గా నీరందని పరిస్థితి. అధికారులు స్పందించి గుర్రపు డెక్కను తొలగించాలి.

\- నల్ల వెంకట్‌రెడ్డి, రైతు



కురుమ సంఘం భవన నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు

గట్టుప్పల్, జూలై 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కురమ సంఘం భవన నిర్మాణ ఏర్పాటుకు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి రూ.5లక్షలు మంజూరు చేసినట్లు కురుమ సంఘం అధ్యక్షుడు కుండే సత్తయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కురుమ సంఘం భవన నిర్మాణానికి డీసీసీ ఉపాధ్యక్షుడు దండు యాదగిరిరెడ్డి సహకారంతో రూ.5లక్షలు మంజూరు చేసిన ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డికి శనివారం కురుమ సంఘం నాయకులు దన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కురుమ సంఘం ప్రధాన కార్యదర్శి కుండె చంద్రయ్య, శంకర్, కుండే సత్తయ్య, కుండే రాజు, మందుల నరేష్, కుండే రమేష్, మురళి, శ్రీశైలం, లింగస్వామి, బాలయ్య, నర్సింహ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలి

నల్లగొండ కల్చరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు, పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను వెంటనే విడుదల చేయాలని పెన్షనర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యాక్షుడు జి.దామోదర్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం నల్లగొండలోని పెన్షన్స్ భవన్‌లో నిర్వహించిన పెన్షనర్స్ సంఘం నల్లగొండ తాలుకా శాఖ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఆర్సీని వెంటనే ప్రకటించాలని, నగదు రహిత వైద్యాన్ని పెన్షనర్లకు అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం 50మంది పెన్షనర్ల జన్మదినం సందర్భంగా ఘనంగా సన్మానించారు. సంఘం అధ్యక్షుడు గజవెల్లి సత్యం అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రధాన కార్యదర్శి యాద వాసుదేవ్, జి.వెంకట్ రెడ్డి, శ్రీశైలం, రామలింగం, రంగయ్య, సుధాకర్, రమేష్, శేషారెడ్డి, చక్రపాణి, ప్రకాష్, ఆలీ, గోపాల్ రెడ్డి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎల్వీ యాదవ్



నియామకపత్రం అందుకుంటున్న ఎల్వీ యాదవ్

నల్లగొండ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎల్వీ యాదవ్‌ను నియమిస్తూ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య నియామక పత్రాన్ని అందజేశారు. శనివారం హైదరాబాద్‌లోని బీసీ భవన్‌లోఆయనను నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ బీసీల సంక్షేమ కార్యక్రమాలను బలోపేతం చేయడానికి, వారి అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో దు డుకు లక్ష్మీనారాయణ, గుండు వెంకటేశ్వర్లు, కూరెళ్ల విజయ్ కుమార్ పాల్గొన్నారు.

మంత్రులను కలిసిన బీసీ సంఘం నాయకులు

నల్లగొండ టౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు మంత్రి మండలికి జిల్లా బీసి సంక్షేమ సంఘం నాయకులు ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు గురువారం జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలను మర్యాద పూర్వకంగా కలసి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమములో బీసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రహరి రామరాజు, జిల్లా ప్రధాన కార్యదరి నెలపట్ల సత్యనారాయణ, సీనియర్ ఉపాధ్యక్షుడు కేశబోయిన శంకర్ ముదిరాజ్, నకిరేకంటి కాశయ్య గౌడ్, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ గౌడ్, కార్యదర్శులు సీతారాములు, జెల్ల ఆదినారాయణ, సాయిబాబా, చొల్లేటి రమేష్ , లాలయ్య గౌడ్ , ఎరుకల శంకర్‌గౌడ్, బండారు గోవర్ధన్, నర్సింగ్ వెంకటేశ్వర్లు, రేగట్టె సైదులు, సురిగి యాదగిరి, జెర్రిపోతుల శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డితో బీసీ సంఘాల నేతల భేటీ

నల్లగొండ టౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని జూబ్లీ హిల్స్‌లోని ఆయన నివాసంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్యతో కలిసి బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పగిడి జీడయ్య యాదవ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ల ఆర్డినెన్స్‌పై సీఎంతో చర్చించారు. ఈ సందర్భంగా జీడయ్య యాదవ్ మాట్లాడుతూ బీసీ హక్కుల సాధన కోసం తీసుకోవాల్సిన తదుపరి చర్యలపై కూడా చర్చించినట్లు తెలిపారు.

● శాలిగౌరారం : బీసీ విద్యార్థి సంఘం నాయకుడు బొల్లేపల్లి స్వామి గౌడ్ ఎంపీ ఆర్ కృష్ణయ్యతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సీఎం రేవంత్ రెడ్డిని, ఆర్. కృష్ణయ్యను స్వామి గౌడ్ సన్మానించారు.

వైద్య శిబిరం ఏర్పాట్ల పరిశీలన

మర్రిగూడ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం మర్రిగూడ జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణంలో నిర్వహించనున్న మెగా కంటి వైద్య శిబిరం ఏర్పాట్లను మర్రిగూడ సీఐ దూది రాజు పరిశీలించారు. ఏర్పాట్ల వివరాలను నిర్వహకులతో మాట్లాడి తెలుసుకున్నారు. వైద్య శిబిరానికి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఫౌండేషన్ చైర్మన్ కోమటిరెడ్డి లక్ష్మి ప్రారంభించినట్లు వారు తెలిపారు. సీఐ వెంట ఎస్ఐ కృష్ణారెడ్డి, ఎంపీడీవో మున్నయ్య, మాజీ జడ్పీటీసీ మేతరి యాదయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ రామదాసు శ్రీనివాస్, రవీందర్‌రావు, శ్రీనివాస్ ఉన్నారు.

రోడ్డు నిబంధనలు అందరూ పాటించాలి

కేతేపల్లి, జూలై 12(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించి ప్రమాదాల నుంచి బయట పడాలని కేతేపల్లి ఎస్ఐ సతీష్ సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణపై కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్ గ్రామంలో శనివారం రాత్రి నల్లగొండ జిల్లా జాగృతి పోలీసు కళా బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పోలీసు కళాబృందం రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా ఉండే చర్యలను తమ ఆటాపాటల ద్వారా సదస్సుకు హాజరైన వారికి వివరించారు. ఈ సదస్సులో ఎస్ఐ సతీష్ మాట్లాడుతూ కేతేపల్లి మండలంలో జాతీయ రహదారిపై ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా స్థానికులే మృతి చెందారని దీనికి రోడ్డు భద్రతపై స్థానికులకు అవగాహన లేకపోవడమే కారణంగా పోలీసుశాఖ భావిస్తుందన్నారు. కార్యక్రమంలో నకిరేకల్ మార్కెట్ చైర్‌పర్సన్ గుత్తా మంజుల, ఏఎస్ఐ దేవసహాయం, డీటీఆర్సీ కె.ఎం.రాజు, కాంగ్రెస్ నాయకులు జి.మాధవరెడ్డి ఎడ్ల ప్రవీణ్, నల్లగొండ పోలీసు కళా బృందం సభ్యులు ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

మహిళల గోరింట సంబురం



గోరింటాకు పెట్టుకున్న మహిళలు

నార్కట్‌పల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసం పురస్కరించుకుని నార్కట్‌పల్లిలోని వాసవీ భవన్‌లో ఆర్య వైశ్య మండల, పట్టణ, మహిళా సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం గోరింటాకు వేడుకలను నిర్వహించారు. ప్రత్యేకంగా పూలతో అలంకరించిన రోలు రోకలితో గోరింటాకును దంచి ప్రత్యేక పూజలనంతరం మహిళలు సామూహికంగా చేతులకు గోరింటాకును అలంకరించుకున్నా రు. కార్యక్రమంలో నార్కట్‌పల్లి పట్టణానికి చెందిన వైశ్య మహిళలు స్వాతి, గీత, కళావతి, శైలజ, దివ్య, పద్మ, లత, వాసవి, వాణి, సంధ్య, లీల, కృష్ణవేణి, ఇంద్రజ, సంతోషి, రంగమ్మ పాల్గొన్నారు.

మీసేవ ఆపరేటర్ల సమస్యలు పరిష్కరించాలి



నూతన కార్యవర్గంతో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల జీవన్ ప్రసాద్, జగన్

నల్లగొండ రూరల్, జూలై 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం, ప్రజలకు అందించే సర్వీసులను ప్రజలకు అందుబాటులో ఉంటూ నిత్యం సేవలు అందించే ఆపరేటర్ల సమస్యలు పరిష్కరించాలని మీసేవ ఆపరేటర్ల రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల జీవన్‌ప్రసాద్ కో రారు. పట్టణంలోని లెక్చరర్స్ భవనంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నెల మొత్తం పనిచేస్తే కనీసం రూ.3వేలు కూడా కమీషన్ రావడం లేదన్నారు. ఒక సెంటర్ నిర్వహించాలంటే వేలాది రూపాయల ఖర్చు అవుతుందని, సహాయకులను నియమించుకుంటే కనీసం రూ.10 వేలు ఇవ్వాల్సి వస్తుందన్నారు. మీసేవ కమీషన్ కరెంట్ బిల్లులకు కూడా చాలడం లేదన్నారు. అనంతరం జిల్లా నూతన మీసేవ ఆపరేటర్ల సంఘం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బత్తుల సుశీల, అధ్యక్షుడిగా సూరారపు సైదులు(రవి), ఉపాధ్యక్షులు తాలకొప్పుల యాదయ్య, ఎర్పుల నర్సింహ, బానోతు రవీందర్, జనరల్ సెక్రటరీగా పంతంగి వేణు, జాయింట్ సెక్రటరీగా కత్తుల అరవింద్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బడుగు సుమన్, గండమల్ల గిరిబాబు, ఎండీ. షరీఫుద్దీన్, శ్రీపతి భాస్కర్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మీసేవ ఆపరేటర్ల సంఘం రాష్ట్ర నాయకులు జగన్, ఆపరేటర్లు గోకరకొండ రమేష్, మమత, పవన్, చందు తదితరులు పాల్గొన్నారు.

సీఎం బహిరంగ సభను విజయవంతం చేయాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ మండల అధ్యక్షుడు సమరంరెడ్డి

శాలిగౌరారం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): తిరుమలగిరిలో ఈ నెల 14న సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొనే బహిరంగ సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కందాల సమరం రెడ్డి కోరారు. మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు నేతృత్వంలో నిర్వహించే భారీ బహిరంగ సభకు శాలిగౌరారం మండల వ్యాప్తంగా ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. జూలై 14న ఉదయం ఎమ్మెల్యే మందుల సామేల్ జన్మదినాన్ని నిర్వహించుకుని గ్రామాల వారిగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తిరుమలగిరికి చేరుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి, వైస్ చైర్మన్ నరిగే నరసింహ, నాయకులు కట్టంగూరి సురేందర్ రెడ్డి, దేవరకొండ జయరాజు, బండమీది రమేష్, కర్నాటి కృష్ణ, పల్స సైదులు, ఇంద్రకంటి యాదయ్య, జమ్ము అశోక్, చెరకు జానీ, లింగస్వామి, నగేష్, జహంగీర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సలీం

రామగిరి, నల్లగొండరూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్యాలయంలో అకారణంగా తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ సలీం, జిల్లా సహాయ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య కోరారు. పట్టణంలోని సుందర య్య భవనంలో శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. మునిసిపల్ కార్యాలయంలో అవుట్‌సోర్సిం గ్ పద్ధతిన పనిచేస్తున్న కరుణాకర్ అనే కార్మికుడిని అకారణం గా తొలగించడం వల్ల కుటుంబాన్ని పోషించలేని పరిస్థితుల్లోనే ఆత్మహత్యయత్నం చేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ విభాగాలు పనిచేస్తున్న కార్మికులను అవుట్‌సోర్సింగ్ కాంట్రాక్టర్లు చిన్న చిన్న కారణాలు చూపిస్తూ వేధింపులకు పాల్పడుతున్నారన్నారు. అకారణంగా తొలగించిన కార్మికులందరినీ తీసుకోవాలని డిమాండ్ చేశారు లేదంటే మునిసిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కన్వీనర్ అవుట రవీందర్, పట్టణ నాయకులు కోట్ల అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కాళికామాత శోభాయాత్ర



నకిరేకల్‌లో నిర్వహించిన కాళికామాత విగ్రహాల శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

నకిరేకల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): నకిరేకల్‌లోని స్వయంభు కాళికామాతకు ఆదివారం భక్తులు బోనాలు సమర్పించనున్నారు. రెండు రోజులుగా కాళికామాత బోనాల పండుగ సందర్భంగా వేడుకలు జరుగుతున్నాయి. శనివారం ఉదయం అమ్మవారికి అర్చన, గోత్రనామాలు, అమ్మవారి ఉత్సవ విగ్రహాలను శ్రీలక్ష్మీ గణపతి దేవాలయం, శివాలయం నుంచి స్వయంభు కాళికామాత దేవాలయానికి పుర వీధుల గుండా ఊరేగింపుగా శోభాయాత్ర నిర్వహించి ఉత్సవ విగ్రహాలను కాళికామాత దేవాలయానికి తరలించారు. అమ్మవారికి ఒడిబియ్యం భక్తులు నింపారు. కార్యక్రమంలో దేవాలయ శాశ్వత వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రహ్మదేవర రవిశంకర్, గౌరవ అధ్యక్షుడు కందాళ లక్ష్మీనారాయణరెడ్డి, సలహాదారులు యల్లపురెడ్డి యాదగిరిరెడ్డి, ల మిశెట్టి సత్యనారాయణ, గర్రె మురళీమోహన్, దికొండ ప్రకాష్, సందుపట్ల వేణుమాధవ్, ఏశబోయిన కొమురయ్య, మేకల దేవయ్య, కొండేటి శ్రీను, పరమేష్, అంబేద్కర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల చట్టాన్ని అమలుచేయాలి

● ఏఐసీబీ ఉపాధ్యక్షుడు పొనుగోటి చొక్కారావు



చొక్కారావు

నల్లగొండ, జూలై 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే దివ్యాంగుల చట్టాన్ని అమలులోకి తీసుకురావాలని ఏఐసీబీ ఉపాధ్యక్షుడు, డ్వాబ్ ప్రధాన కార్యదర్శి పొనుగోటి చొక్కారావు డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఇటీవల బీసీలకు 42శాతం రిజర్వేషన్‌ను ఆర్డినెన్స్ ద్వారా తీసుకురావడాన్ని స్వాగతించడంతో పాటు హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. అయితే లేని బీసీ చట్టాన్ని తీసుకవస్తున్న ప్రభుత్వం అంతకు ముందే ఉన్న దివ్యాంగుల చట్టాన్ని అమలు చేయాలని కోరారు. బీసీల రిజర్వేషన్‌పై ఆర్డినెన్స్ తెస్తున్న ప్రభుత్వం ఎవరూ కోర్టుకు వెళ్లి పిటిషన్లు వేసి అడ్డుకోవద్దని కోరుతుందని, అయితే దివ్యాంగుల చట్టం అమలును అడ్డుకునేలా ఎందుకు ప్రభుత్వం కోర్టులో రివ్యూ పిటిషన్ వేసిందని ప్రశ్నించారు. తక్షణమే ప్రభుత్వం దివ్యాంగుల చట్టాన్ని అమలులోకి తీసుకువచ్చి ప్రత్యేక కమిషన్‌ను నియమించాలని కోరారు. దివ్యాంగుల చట్టం అమలులోకి వచ్చి ప్రత్యేక కమిషనర్ ఉంటే దివ్యాంగుల సమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు. ఈ చట్టం వల్ల దివ్యాంగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెంపొందుతాయని, వారు స్వశక్తితో ఆత్మగౌరవంతో జీవించేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు.

నారాయణరావు మృతికి సంతాపం

నల్లగొండరూరల్, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లా సీపీఐ జిల్లా మాజీ కార్యదర్శి, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు దొడ్డా నారాయణ రావు చిలుకూరు మండల కేంద్రంలో మృతి చెందారు. ఆయన మృతికి సీపీఎం నల్లగొండ జిల్లా కమిటీ సంతాపం తెలిపి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాటంలో కీలకపాత్ర పోషించాలని తెలిపారు. అలాగే చిలుకూరు ఎంపీపీగా, జడ్పీటీసీగా అనేక ప్రజా సమస్యల పరిష్కారానికి నికరంగా కృషి చేశారని గుర్తు చేశారు. ఆయన మృతి ఉమ్మడి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరనిలోటని తెలిపారు.

మునుగోడు: నారాయణరావు మృతికి మునుగోడు మండల శాఖ నాయకులు సంతాపం తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో గురిజ రామచంద్రం, బొల్లారి నర్సింహ, తీర్పారి వెంకటేశ్వర్లు, సురిగి చలపతి, గోసుకొండ లింగయ్య, బొమ్మబోయిన లాలు, యాదయ్య, వెంకన్న, జానీమియా, రమేష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

సిగ స్వామి కుటుంబానికి ఆర్థిక సాయం

నార్కట్‌పల్లి, జూలై 12(ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండలంలోని చిన్ననారాయణపురం గ్రామ వాస్తవ్యుడు విశ్వహిందూ పరిషత్ ప్రఖండ అధ్యక్షుడు సిగ స్వామి ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. అతని కుటుంబ సభ్యులకు స్వయంసేవక్‌లు రూ.75వేల ఆర్థిక సాయాన్ని శనివారం అందజేశారు. చిన్ననారాయణపురంలో జరిగిన సంస్మరణ కార్యక్రమానికి హాజరైన స్వయం సేవక్‌లు హిందూ ధర్మం కోసం స్వామి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని బీజేపీతో పాటు స్వయంసేవక్‌లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మేడబోయిన శ్రీనివాస్, పాల్వాయి భాస్కర్‌రావు, మునుకుంట్ల గణేష్, బిళ్లకంటి శ్రీకాంత్, పాలకూరి రమేష్, నల్లగొండ నాగరాజు, వీహెచ్‌పీ ప్రఖండ తదితరులు పాల్గొన్నారు.

క్లాస్‌మేట్ కుటుంబానికి ఆర్థిక సాయం

నార్కట్‌పల్లి, జూలై 12(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన క్లాస్‌మేట్ కుటుంబానికి తోటి స్నేహితులు అండగా నిలిచారు. నార్కట్‌పల్లి జడ్పీహెచ్ఎస్ 1989-90 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థి ఎనమళ్ల శ్రీనివాస్ గత నెలలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో అతని క్లాస్‌మేట్స్ పూర్వవిద్యార్థులంతా కలిసి సేకరించిన రూ.61 వేల నగదును శ్రీనివాస్ భార్యకు శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో జినుకల చంద్రయ్య, దేవరశెట్టి నారాయణ, పూల రజనీకాంత్, షణ్ముఖచారి, జే.వెంకటేశ్వర్లు, బక్కులు శ్రీనివాస్, యాదగిరి, కుమార్, శ్రీనివాస్, ఎం.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ

కట్టంగూరు: సీపీఐ(ఎంఎల్) సీనియర్ నాయకుడు గజ్జి వీరయ్య ప్రథమ వర్ధంతి సభను జయప్రదం చేయాలని కోరుతూ సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు న్యూడెమోక్రసీ డివిజన్ నాయకుడు బూరుగు సత్తయ్య, గజ్జి రవి కోరారు. మండలంలోని ఈదులూరు గ్రామంలో శనివారం వారు కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెల 18న మండలంలోని పందెనపల్లి గ్రామంలో నిర్వహించే ప్రథమ వర్ధంతి సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గద్దపాటి యాదయ్య, అంజయ్య, దశరథ, గద్దపాటి లింగయ్య, పెద్ద వీరయ్య, లింగయ్య పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడికి ఖండన

నార్కట్‌పల్లి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బంగారుపాళ్యంలో జగన్ పర్యటన కవరేజీకి వెళ్లిన ఆంధ్రజ్యోతి దినపత్రిక ఫొటోగ్రాఫర్ శివకుమార్‌పై వైసీపీ రౌడీ మూకల దాడిని టీడీపీ భువనగిరి పార్లమెంట్ మాజీ కార్యదర్శి లింగాల యాదయ్య, బండారు శివరాం ప్రసాద్, చింత రాజు, చెన్నారపు సత్తయ్య సంయుక్తంగా చేసిన ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. మీడియాపై దాడి ప్రజాస్వామ్యంపై దాడిగానే పరిగణించాలన్నారు. వార్తల సేకరణకు వెళ్లిన రిపోర్టర్లను, వీడియో, ఫొటో కెమెరామెన్‌లపై వైసీపీ కార్యకర్తలు రౌడీల్లా దాడి చేయడం సరైంది కాదన్నారు.

వృథాగా ఉన్న డీ ఫ్లోరినేషన్ ప్లాంట్‌ను తొలగించాలి

నార్కట్‌పల్లి: తమ గ్రామంలో ఏళ్ల తరబడి వృథాగా ఉన్న డీ ఫ్లోరినేషన్ ప్లాంట్‌ను తొలగించి ఆ స్థలాన్ని ప్రభుత్వ అవసరాలకు వినియోగించాలని సామాజిక ఉద్యమకారుడు అక్షర వెలుగు సామాజిక సేవా సంస్థ వ్యవస్థాపకుడు భీంపాక సైదులు ఒక ప్రకటనలో అధికారులకు సూచించారు. ఫ్లోరైడ్ సమస్య పరిష్కారానికి దాదాపు 30ఏళ్ల క్రితం నెథర్లాండ్స్ సహకారంతో ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఈ ప్లాంట్‌ను తొలగించి ఆ స్థలాన్ని ప్రభుత్వ అవసరాలకు వినియోగించాలని సైదులు కోరారు.

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	548.60 (206.7042)	5,244	62,400
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	641.57 (3.58)	12.73	68.78
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	153.509 (18.70)	8,685	5,000

ప్రాజెక్టుల నీటిమట్టం

చికెన్ ధరలు: లైవ్: రూ.125 | డ్రెస్: రూ.180 | స్కిన్‌లెస్: రూ.210

ఏకేబీఆర్ ఎత్తిపోతల పనులు ముమ్మరం



» పీఏపల్లిలో రూ.90కోట్లతో నిర్మాణం » ప్రణాళిక సిద్ధం చేసిన అధికారులు

కృష్ణానది పక్కనే పారుతున్నా సాగునీరు లేక ఇబ్బందులు పడుతున్న రైతుల సమస్యలు పరిష్కరించేందుకు గత ప్రభుత్వం పీఏ.పల్లి మండలంలో రెండు ఎత్తిపోతల పథకాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా ఎస్సీ కాలనీ సమీపంలో నిర్మిస్తున్న అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (ఏకేబీఆర్) లిఫ్ట్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ ఎత్తిపోతల పథకం పనులు దాదాపు 70శాతం పూర్తయ్యాయి.

- (ఆంధ్రజ్యోతి, పెద్దఅడిశర్లపల్లి)

ఏఎమ్మార్పీ ప్రాజెక్టులో భాగమైన అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ఎగువ భాగంలోని ఎస్సీ కాలనీ సమీపంలో అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ఎత్తిపోతల పథకాన్ని నిర్మిస్తున్నారు. రూ.90కోట్ల వ్యయంతో 6,691 ఎకరాలకు సాగునీరు అందించేందుకు వీలుగా అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. రిజర్వాయర్ నుంచి ఎత్తిపోసిన నీటిని పైపులైను ద్వారా 5కిలోమీటర్ల దూరంలోని చిలకమర్రి సమీపంలో ఏర్పాటు చేయనున్న సంపునకు తరలిస్తారు. అక్కడి నుంచి నాలుగు విభాగాలుగా 56 కిలోమీటర్ల వరకు పైప్‌లైన్ ద్వారా నీటిని చెరువులు, కుంటల్లోకి తరలించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. అందుకు సంబంధించిన పంప్ హౌస్ పనులు దాదాపు పూర్తికావొచ్చాయి. పైప్‌లైన్ ఏర్పాటు కూడా 4కిలోమీటర్లు పూర్తయింది. మిగిలిన కిలోమీటర్‌కు సంబంధించి రైతులకు పరిహారం అందకపోవడంతో పనులు నిలిపివేశారు. రైతులకు పరిహారం అందిన వెంటనే సంపు నిర్మాణం, పైప్‌లైన్ పనులు ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు. గ్రావిటీ పైపులు 56 కిలోమీటర్ల పనులకు అనుమతి రాలేదని ఈ పనులు పూర్తయిన వెంటనే వాటి ఏర్పాటును ప్రారంభిస్తామని తెలిపారు. బాలజీనగర్, పీఏపల్లి, సూరేపల్లి, రోళ్లకల్లు, చిలకమర్రి, గుర్రంపోడు మండలంలోని ఆయకట్టు ప్రాంతమైన 2,100 ఎకరాలకు రైతుల నష్టపరిహారం చెల్లింపు విషయంలో జాప్యం జరుగుతుండటంతో ఎత్తిపోతల పనులు ఆలస్యంగా జరుగుతున్నాయి. రైతులకు చెక్కులు అందిన వెంటనే పనులు ప్రారంభించడానికి అధికారులు సిద్ధంగా ఉన్నారు.

అటవీశాఖ అనుమతుల కోసం

నాగార్జునసాగర్ వెనుక జలాల నుంచి నీటిని ఎత్తిపోసే పెద్దగట్టు ఎత్తిపోతల నిర్మాణానికి గత ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ ఎత్తిపోతల పరిధిలో కొంతభాగం అటవీశాఖ భూములు ఉండటంతో అనుమతుల కోసం అటవీశాఖకు అధికారులకు నివేదిక అందజేశారు. కానీ ఇప్పటి వరకు ఎలాంటి అనుమతులు రాలేదు. దీంతో పెద్దగట్టు ఎత్తిపోతల పనులు ప్రారంభించలేదని అధికారులు చెబుతున్నారు.

పంప్‌హౌస్ నిర్మాణం దాదాపు పూర్తి



ఏఎమ్మార్పీ ప్రాజెక్టులో భాగమైన అక్కంపల్లి బ్యాలెన్సింగ్ ఎగువ భాగంలోని ఎస్సీ కాలనీ సమీపంలో నిర్మిస్తున్న ఏకేబీఆర్ లిఫ్ట్ నిర్మాణంలో భాగంగా పంప్‌హౌస్ నిర్మాణం దాదాపు పూర్తయింది. పైప్‌లైన్ కూడా 4కిలోమీటర్ల వరకు పూర్తయింది. మిగిలిన పనులు కూడా త్వరలోనే పూర్తి చేస్తాం. గ్రావిటీ పనులకు అనుమతి రాలేదు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

- నాగయ్య, ఇరిగేషన్ డీఈ

చెక్కులు ఇచ్చిన తర్వాతే పనులు ప్రారంభించాలి



రైతులకు సమానంగా నష్టపరిహారం అందించాలి. కొందరి రైతులకు ఎక్కువ, మరికొందరికి తక్కువ నష్టపరిహారం అందించేలా అధికారులు నివేదికలు తయారు చేశారు. 5కిలోమీటర్ల పరిధిలో 4ఎకరాల పది గుంటల భూమి పైప్‌లైన్‌లో పోతుంది. రైతులకు అందించే నష్టపరిహారంలో తేడాలు ఉన్నాయి. అందరికీ సమానంగా చెక్కులు అందజేస్తేనే పనులు ప్రారంభించేందుకు అనుమతి ఇస్తాం.

- వంగాల వెంకట్‌రెడ్డి, రైతు, అంగడిపేట

నార్కట్‌పల్లి మార్కెట్‌కు లైన్‌క్లియర్?

» చౌటుప్పల్ మార్కెట్ పరిధిలోని చిట్యాల మండలం తొలగింపు
» చిట్యాల వ్యవసాయ మార్కెట్‌లో వాటి విలీనం
» ఇదే ఫార్ములాతో నార్కట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ ఏర్పాటుకు కసరత్తు



మాండ్రలోని సబ్ మార్కెట్ యార్డు (ఫైల్)

నార్కట్‌పల్లిలో వ్యవసాయ మార్కెట్ కమిటీ త్వరలో ఏర్పాటు కానున్నట్లు సమాచారం. ఇటీవల చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం చేసిన విజ్ఞప్తి మేరకు నార్కట్‌పల్లిలో వ్యవసాయ మార్కెట్ మంజూరుకు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఇచ్చిన హామీ కార్యరూపం దాల్చనుంది. అందుకు సంబంధించిన కసరత్తు మొదలైనట్లు సమాచారం.

- (ఆంధ్రజ్యోతి, నార్కట్‌పల్లి)

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి చిట్యాల మండలానికి చెందిన ఎనిమిది రెవెన్యూ గ్రామాలు చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోకి వెళ్లాయి. చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ పరిధిలో కొనసాగుతున్న ఆ గ్రామాలను తిరిగి చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీలో విలీనం చేసేలా ప్రభుత్వం అధికారికంగా త్వరలో ఉత్తర్వులు జారీ చేయనుంది. ఈ నేపథ్యంలో నార్కట్‌పల్లిలో వ్యవసాయ మార్కెట్ ఏర్పాటుకు లైన్‌క్లియర్ అయినట్టు మండలానికి చెందిన అధికార పార్టీల నేతలు విశ్వసిస్తున్నారు. చిట్యాల మండలానికి చెందిన ఎనిమిది రెవెన్యూ గ్రామాలను చౌటుప్పల్ మార్కెట్ నుంచి తొలగించి చిట్యాల మార్కెట్‌లో విలీనం చేసిన ఫార్ములానే నార్కట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఏర్పాటులో పాటించనున్నట్టు తెలిసింది.

సబ్ మార్కెట్ ప్రారంభం రోజున ప్రకటించే అవకాశం..

మాండ్రలో నిర్మించిన సబ్ మార్కెట్ యార్డు ప్రారంభ సమయంలో నార్కట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ ఏర్పాటుకు సంబంధించిన అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని అధికార పార్టీ నేతలు భావిస్తున్నారు. అందుకు సంబంధించిన సన్నాహాలు మొదలైనట్లు తెలిసింది. వాస్తవానికి నార్కట్‌పల్లిలో వ్యవసాయ మార్కెట్ కమిటీని ఏర్పాటు చేయాలనే డిమాండ్ పెద్దగా లేదు. కానీ, చిట్యాల వ్యవసాయ మార్కెట్ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం రోజున ఇక్కడి నేతలు మాండ్ర సబ్ మార్కెట్ యార్డును ప్రారంభించేందుకు మంత్రిని సమయం అడగాలని ఎమ్మెల్యేను కోరారు. అయితే సబ్ మార్కెట్ యార్డు ఏర్పాటుతో అవస్థాపనా సౌకర్యాలు సమకూరినందున నార్కట్‌పల్లిని సబ్ మార్కెట్‌గా కాకుండా మార్కెట్‌గానే ఏర్పాటు చేయిస్తానని పార్టీ శ్రేణులతో ఎమ్మెల్యే వీరేశం పేర్కొన్నారు.

మార్కెట్ ఏర్పాటైతే

నార్కట్‌పల్లిలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఏర్పాటైతే రైతులకు బహుళ ప్రయోజనాలు ఏర్పడనున్నాయి. ఆరుగాలం శ్రమించి పండించిన పంటలను గిట్టుబాటు ధరకు విక్రయించే వెసులుబాటు ఉంటుంది. ఒకవేళ గిట్టుబాటు ధర లేకుంటే మార్కెట్ యార్డులోనే నిల్వ ఉంచి ధర వచ్చినపుడే విక్రయించుకునే సదుపాయం ఉండనుంది. మండలం మిగతా 8వ పేజీలో...

నాఫ్స్కాబ్ డైరెక్టర్‌గా కుంభం శ్రీనివాస్‌రెడ్డి

సహకార వ్యవస్థలో కీలక భూమికకు అవకాశం



నల్లగొండ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (డీసీసీబీ) చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి నాఫ్స్కాబ్ (నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ స్టేట్ కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్) డైరెక్టర్‌గా నియామకమయ్యారు. ఈ మేరకు శనివారం నాఫ్స్కాబ్ మేనేజింగ్ డైరెక్టర్ బీమా సుబ్రహ్మణ్యం ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ప్రగతి బాటలో పయనింపజేసేలా డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి కృషి చేస్తున్న నేపథ్యంలో ఆయనకు తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం కల్పించారు. ఢిల్లీ కేంద్రంగా ఉండే నాఫ్స్కాబ్ కో-ఆపరేటివ్ బ్యాంకుల నుంచి రైతుల సంక్షేమం కోసం తీసుకునే నిర్ణయాల్లో డీసీసీబీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి జాతీయ స్థాయి డైరెక్టర్‌గా ఇక నుంచి కీలక భూమిక పోషించనున్నారు. మునుగోడు మండలం కల్వకుంట్ల గ్రామానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి మునుగోడు పీఏసీఎస్ చైర్మన్‌గా, ఉమ్మడి నల్లగొండ జిల్లా డీసీసీబీ చైర్మన్‌గా పనిచేస్తుండగా, తాజాగా జాతీయస్థాయిలో నాఫ్స్కాబ్ డైరెక్టర్‌గా నియమించడంపై పాలకవర్గ డైరెక్టర్లతోపాటు, అధికారులు, ఉద్యోగులు, పలువురు ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కుంభం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, తనను నియమించిన మేనేజింగ్ డైరెక్టర్ బీమా సుబ్రహ్మణ్యానికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సీఎల్పీ మాజీ నాయకులు కుందూరు జానారెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రమాదాలు చేస్తే డ్రైవింగ్ లైసెన్స్ రద్దు

రవాణా, బీసీశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్





నల్లగొండలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్, బస్సు నడుపుతున్న మంత్రి కోమటిరెడ్డి

నల్లగొండ టౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పొరపాటుగా ప్రమాదాలు చేస్తే అవసరమైతే డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేసేలా భవిష్యత్తులో చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రవాణా, బీసీశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. వాహనాల వెనకవైపు రిఫ్లెక్టర్ రేడియం స్టిక్కర్లను తప్పనిసరిగా వినియోగించేలా జీవో తీసుకురానున్నామని, అలాగే డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్లను ఏర్పాటుచేసే ఆలోచనలో ఉన్నామని తెలిపారు. శనివారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి జిల్లా కేంద్రం సమీపంలోని దండంపల్లి వద్ద రూ.8కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ, నిర్లక్ష్యంగా వాహనం నడపడం, వాహనం ఫిట్‌నెస్ లేకపోవడం తదితర కారణాలతో ప్రమాదాలు జరుగుతున్నాయని, వీటిని తగ్గించేందుకు ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ ఉపయోగపడుతుందన్నారు. ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్‌లో సాంకేతిక పరికరాల సహాయంతో సుమారు 15 అంశాల్లో వాహన ఫిట్‌నెస్‌ను నిర్ధారిస్తుందని తెలిపారు. రవాణారంగంలో సాంకేతిక విప్లవాన్ని తీసుకురావాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని, అందులో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా ఒక్కోటి రూ.8కోట్ల వ్యయంతో ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు.

స్క్రాపింగ్ పాలసీని తీసుకువచ్చామని, ఏటీసీతో ప్రతీ వాహనం వాహన సారథి పరిధిలోకి వచ్చే విధంగా భాగస్వామ్యం చేశామన్నారు. ట్రాఫిక్ అవేర్నెస్‌లో భాగంగా అవగాహన కార్యక్రమాలు, విద్యార్థులకు క్లబ్‌లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో డ్రైవింగ్ లైసెన్స్ టెస్ట్‌లను ఆటోమేటిక్‌గా నిర్వహించేలా చర్యలు తీసుకుంటామన్నారు. పాశ్చాత్య దేశాల మాదిరిగానే ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే జరిమానా విధించడమేగాక, పొరపాటున ప్రమాదం చేసినట్లయితే అవసరమైతే లైసెన్స్ రద్దు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణాన్ని 20 నెలల్లో 200కోట్ల మంది మహిళలు వినియోగించుకున్నారన్నారు. నల్లగొండ జిల్లాకు 70 ఎలక్ట్రికల్ బస్సులు మంజూరుకాగా, 10 బస్సులు నార్కెట్‌పల్లికి, మిగతావి ఇతర ప్రాంతాలకు తిప్పనున్నట్లు తెలిపారు. నార్కెట్‌పల్లికి 80 కొత్త బస్సులు కావాలని, నూతన డిపో ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని రవాణాశాఖ మంత్రికి విజ్ఞప్తి చేశారు. అదే విధంగా నల్లగొండ జిల్లా కేంద్రంలో ఎలక్ట్రికల్ బస్సులను మంత్రులు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బస్‌స్టేషన్ నుంచి జిల్లా కోర్టు వరకు స్వయంగా బస్సు నడిపారు. కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, బత్తుల లక్ష్మారెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవర్, జిల్లా ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ శ్రీవాణి, అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్, రవాణాశాఖ కమిషనర్ చంద్రశేఖర్, విశ్రాంత ఆర్టీవో మోహన్‌రెడ్డి, ఆర్టీవో మెంబర్లు రాజిరెడ్డి, రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం



నల్లగొండలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొన్నం, కోమటిరెడ్డి ప్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్

నల్లగొండ టౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సామాజిక న్యాయం పాటిస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని ఎమ్మెల్సీ, డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించడానికి నిర్ణయం తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేస్తూ శనివారం క్లాక్ టవర్ సెంటర్లో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల ప్లెక్సీలకు పాలాభిషేకం నిర్వహించారు. మహాత్మ జ్యోతిబాపూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్‌నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ బడుగు, బలహీన వర్గాల పార్టీ అని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ నిర్ణయం తీసుకోవడం హర్షణీయమన్నారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్, మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, నాయకులు బొజ్జ శంకర్, జూలకంటి శ్రీనివాస్, ఆలకుంట్ల మోహన్‌బాబు, మారగోని నవీన్‌గౌడ్, ఆలకుంట్ల నాగరత్నంరాజు, ఇంతియాజ్, శ్రీనివాస్, ఆమీర్, గంగుల సైదులు, సమద్, కత్తుల కోటి, ఇబ్రహీం, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దాలి

పీఈటీఏ టీఎస్ రాష్ట్ర కార్యదర్శి కృష్ణమూర్తి



నల్లగొండలో సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణమూర్తి

నల్లగొండ స్పోర్ట్స్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడల్లో రాణించేలా తీర్చిదిద్ది క్రీడాభివృద్ధికి దోహదపడాలని పీఈటీఏ టీఎస్ రాష్ట్ర కార్యదర్శి పొన్నగని కృష్ణమూర్తిగౌడ్ అన్నారు. శనివారం నల్లగొండలో జరిగిన పీటీఎస్ఏ టీఎస్ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అనంతరం జరిగిన వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశంలో జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా జింగి చంద్రయ్య, ప్రధాన కార్యదర్శిగా తాళ్ల శ్రీనివాస్‌గౌడ్, కోశాధికారిగా ఎం.సత్యనారాయణ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో వ్యాయామ విద్య ఉపాధ్యాయులు వి.రవీందర్, బి.వెంకటరత్నం, సీహెచ్.బ్రహ్మయ్య, శంభు లింగం, మాణిక్యం, సీహెచ్.పుల్లయ్య, కరుణాకర్‌రెడ్డి, లెనిన్, మధుసూదన్, సిద్ధు, సూర్యనారాయణ, సుమన్, శివ, తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్‌పై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదు



విలేకరులో సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్

దేవరకొండ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): బీసీలకు రిజర్వేషన్లు కల్పించడంపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధిలేదని, స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేసేందుకే బీసీ రిజర్వేషన్ల డ్రామా ఆడుతోందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ విమర్శించారు. శనివారం దేవరకొండలో ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో బీహార్, రాజస్థాన్, కేరళ రాష్ట్రాల్లో ఇలాంటి జీవోలు ఇస్తే కోర్టుల్లో నిలబడలేదన్నారు. రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్‌లో పెట్టకుండా రిజర్వేషన్లు ఎలా అమలవుతాయని ఆయన ప్రశ్నించారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో పేర్కొన్న ఏ ఒక్క హామీ కూడా కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. బీసీ రిజర్వేషన్ల బిల్లు ఆమోదం కోసం కేంద్ర ప్రభుత్వంతో ఎలాంటి ప్రయత్నం చేయించలేదన్నారు. బీసీలను మోసం చేసేందుకే కాంగ్రెస్ కుట్రపన్నుతోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం చట్టం చేస్తే బీసీ రిజర్వేషన్లు అమలవుతాయని, సీఎం రేవంత్‌రెడ్డికి తెలిసినా, ఆర్డినెన్స్‌తో బీసీ రిజర్వేషన్లు ఎలా సాధ్యమన్నారు. బీసీల్లో ఉప కులాలకు రిజర్వేషన్లు ఇస్తామన్న హామీ ఏమైందని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలపై కపట ప్రేమ చూపతూ నాటకం ఆడుతోందని, పాలాభిషేకాలు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. బీసీలకు రాష్ట్ర బడ్జెట్‌లో రూ.20వేల కోట్లు కేటాయిస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాయమాటలను బీసీలు నమ్మి మోసపోవద్దని హితవుపలికారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి సరైన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీఆర్ఎస్ దేవరకొండ అధ్యక్షుడు టీవీఎన్.రెడ్డి, గాజుల ఆంజనేయులు, చింతపల్లి సుభాష్‌గౌడ్, వల్లపురెడ్డి, బాలయ్య, జనార్ధన్‌రావు, నీల రవికుమార్, రాజు, కృష్ణ, ఆరేకంటి రాములు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం నుంచి తొలగించారని ఆత్మహత్యాయత్నం

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఘటన 6

ప్రజల కోసం పలు కేంద్ర పథకాలు



నల్లగొండలో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

నల్లగొండ టౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ప్రజల కోసం కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని జాతీయ కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వీరెల్లి చంద్రశేఖర్ అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ 11 ఏళ్ల పాలన పూర్తయిన సందర్భంగా బీజేపీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు మిరియాల వెంకటేశం అధ్యక్షతన శనివారం పలు వార్డుల్లో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో వారు మాట్లాడారు. ప్రధాని మోదీ పలు రైతు సంక్షేమ పథకాలను నేరుగా రైతులకే అందిస్తున్నారని అన్నారు. దేశంలోని 80కోట్ల మందికి ఉచిత రేషన్ బియ్యాన్ని అందజేస్తోందని, ప్రతీ గ్రామంలో రైతు వేదికలు, శ్మశాన వాటికలు, సీసీ రోడ్లు, ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేసి వికసిత భారత్ లక్ష్యంతో ముందుకువెళ్తుందన్నారు. బీజేపీ పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా ప్రతీ కార్యకర్త 11 మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బొజ్జ నాగరాజు, పట్టణ ప్రధాన కార్యదర్శులు మంగళపల్లి కిషన్, కటకం శ్రీధర్, బిపంగి జగ్జీవన్, దొండ ముకేష్, బిపంగి వినోద్, వేమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, దొండ వెంకన్న, పందుల వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

జ్యూట్ బ్యాగులను వినియోగించాలి

దేవరకొండ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ ప్రమాదకరమని, జ్యూట్ బ్యాగులను వినియోగించాలని నాబార్డు జిల్లా అధికారి విజయ్‌కుమార్ అన్నారు. శనివారం నాబార్డు వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా దేవరకొండ మండలం అచ్చమ్మకుంటతండాలో యాక్షన్ ఫర్ రూరల్ డెవెలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ అనర్థాలపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు అంతా కృషి చేయాలన్నారు. రైతులకు నాబార్డు అండగా ఉంటూ రుణాలు మంజూరు చేస్తోందని, రైతు సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. ప్లాస్టిక్ వినియగం వల్ల కలిగే అనర్థాలను తండావాసులకు వివరించి జ్యూట్ బ్యాగులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో యాక్షన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ అధ్యక్షుడు ఖాజాకైరత్, సభ్యులు కోట్య, శంకర్, ఆల్య, నాబార్డు ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి *** మిర్యాలగూడ
నాగార్జునసాగర్, దేవరకొండ
8 www.andhrajyothy.com ● ఆదివారం 13 జూలై 2025

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు

నాగార్జునసాగర్, జూలై12(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్‌లోని జ్యోతిబా పూలే బీసీ బాలుర గురుకుల డిగ్రీ కళాశాలలో గణితం బోధించుటకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మాధవి లత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీలో 55 శాతం మార్కులతో పాస్ అయిఉండి డిగ్రీ బోధనలో అనుభవం కలిగ ఉండాలని పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 14వ తేదీన తమ దరఖాస్తుతో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూ హాజరుకావాలని కోరారు.

కాంగ్రెస్‌తోనే ప్రగతి సాధ్యం: నాగభూషణ్

చింతపల్లి, జూలై 12(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌తోనే రాష్ట్రం అన్ని రంగాల్లో ప్రగతి సాధిస్తుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాభూషణ్ తెలిపారు. మండలంలోని నెల్వలపల్లిలో శనివారం ఆయన విలేకరులతో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలో భాగంగా 42 శాతం బీసీలకు రిజర్వేషన్ కల్పించడానికి సీఎం రేవంత్ రెడ్డి కృషి ఆమోఘన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

సమస్యల పరిష్కారమే భూభారతి లక్ష్యం

● జంగాల కృష్ణయ్య, తహసీల్దార్, నిడమనూరు



ఇంటర్వ్యూ Interview

భూసమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం భూభారతి చట్టం తెచ్చిందని, ధరణిలో దొర్లిన పొరపాట్లను సరిదిద్దేందుకు ఈ చట్టం ఎంతో దోహదం చేస్తుందని తహసీల్దార్ జంగాల కృష్ణయ్య తెలిపారు. రెవెన్యూ సదస్సులు, సాదాబైనామా, పీవోటీ భూములు, రైతులు పెట్టుకున్న దరఖాస్తులు, పరిష్కారం గురించి ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

(ఆంధ్రజ్యోతి- నిడమనూరు)

ఆంధ్రజ్యోతి: ప్రభుత్వం కొత్తగా అమలు చేస్తున్న భూభారతి చట్టం ముఖ్య ఉద్దేశమేమిటి?

తహసీల్దార్: రైతులకు మరింత మేలు చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కొత్తగా భూభారతి చట్టం అమలు చేస్తుంది. గత ధరణిలో దొర్లిన కొన్ని పొరపాట్లను ఈ చట్టం సరిచేస్తుంది. ఏళ్ల తరబడి ఉన్న భూసమస్యల పరిష్కారానికి ఇది ఎంతగానో దోహదం చేస్తుంది.

ఆంధ్రజ్యోతి: మండలంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ఎన్ని దరఖాస్తులు వచ్చాయి?

తహసీల్దార్: మండలంలోని 15 రెవెన్యూ గ్రామాల్లో 2027 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో పీవోటీ, అసైన్డ్ భూముల పరిష్కారం కోసం ఎక్కువగా దరఖాస్తులు వచ్చాయి.

ఆంధ్రజ్యోతి: దరఖాస్తుల పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

తహసీల్దార్: దరఖాస్తులను పరిశీలించి ఆన్‌లైన్ చేశాం. సాదాబైనామా దరఖాస్తులు మినహా మిగతా రైతులకు నోటీసులు ఇచ్చాం. సాధాసాధ్యాలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి: సాదాబైనామా దరఖాస్తుల పరిస్థితి గురించి చెప్పండి?

తహసీల్దార్: సాదాబైనామా పరిష్కారం గురించి 186 దరఖాస్తులు వచ్చాయి. కానీ సాదాబైనామా వ్యవహారం కోర్టులో పెండింగ్‌లో ఉంది. ప్రభుత్వ నిర్ణయం మేరకు చర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి: ప్రభుత్వ భూముల సమస్యలను పరిష్కరిస్తున్నారా?

తహసీల్దార్: 2012 యాక్టు ప్రకారం మండల కేంద్రానికి ఐదు కిలోమీటర్ల లోపు ఉన్న ప్రభుత్వ భూములు కొనడం, అమ్మడం నిషేధం. ఐదు కిలోమీటర్ల అవతల ఉన్న ప్రభుత్వ భూముల సమస్యలు పరిష్కారిస్తాం.

నారాయణరావు 9వ వర్ధంతి నేడు



ఉజ్జిని నారాయణరావు

చింతపల్లి, జూలై 12(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించిన సీపీఐ సీనియర్ నేత నల్లగొండ జిల్లా మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని నారాయణరావు(90) మృతి చెంది నేటికి తొమ్మిది సంవత్సరాలు. నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలోని ఘడియాగౌరారం గ్రామంలోని వ్యవసాయ కుటుంబంలో ఉజ్జిని నారాయణరావు జన్మించారు. చిన్న నాటి నుంచి పోరాటాల్లో పాల్గొనే మనస్తత్వం కలిగిన నారాయణరావు 1985 నుంచి 1999 వరకు మునుగోడు ఎమ్మెల్యేగా మూడు పర్యాయాలు పని చేశారు. నేడు చింతపల్లిలో ఆయన ఆయన తొమ్మిదో వర్ధంతిని నిర్వహించనున్నారు.

ఎన్నికలు వాయిదా వేయడానికే రిజర్వేషన్

చింతపల్లి, జూలై 12(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా వేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి 42 శాతం రిజర్వేషన్ డ్రామా చేస్తున్నారని బీఆర్ఎస్ యువజననేత సిమర్ల శ్రీను తెలిపారు. శనివారం మండలకేంద్రంలో ఆయన మాట్లాడుతూ 42శాతం రిజర్వేషన్లకు చట్టబద్దత కల్పిస్తారని ప్రశ్నించారు. బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కేవలం రాజకీయలబ్ధికోసమే కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు.

అజయ్ మృతి బాధాకరం

చింతపల్లి, జూలై 12(ఆంధ్రజ్యోతి): చింతపల్లి మండలంలోని గొల్లపల్లి గ్రామ పంచాయతీలోని సమైక్యనగర్‌కు చెందిన కూన అజయ్ మృతి బాధాకరమని బీఆర్ఎస్ రాష్ట్రనేత కంకణాల వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం సమైక్యనగర్‌లో విద్యుదాఘాతంతో మృతిచెందిన అజయ్ మృతదేహానికి పూలమాల వేసి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడి కుటుంబ సభ్యులకు తగిన ఆర్థికసహాయం అందించి అదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఆర్థిక సహాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న కరుణాకర్‌రెడ్డి

వేములపల్లి, జూలై 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని మొల్కపట్నం గ్రామానికి చెందిన బొల్లెపల్లి జానయ్య అనారోగ్యంతో మృతిచెందగా వారి కుటుంబసభ్యులకు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి రూ.10వేల ఆర్థిక సహాయాన్ని శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్న ఆయన వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పందుల జానకిరాములు, పందుల సైదులు, బారి లింగయ్య, గిరిబాబు, శ్రీనివాస్‌రెడ్డి, రమణయ్య, వెంకన్న, జానకిరాంరెడ్డి, యాదగిరి, సతీష్, భీమయ్య, జగన్, సైదులు, మల్లయ్య, రమేష్, రాములు పాల్గొన్నారు.

లైన్‌క్లియర్?

(5వ పేజీ తరువాయి)

కూడా వ్యాపార, వాణిజ్యపరంగా కొంత అభివృద్ధి సాధించనుంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా కొందరికి మార్కెట్ కమిటీ ఉపాధి కేంద్రంగా నిలవనుంది.

తీరనున్న రాజకీయ నిరుద్యోగం

నార్కట్‌పల్లిలో వ్యవసాయ మార్కెట్ ఏర్పాటుతో కొంత రాజకీయ నిరుద్యోగం తీరనుంది. కొందరికి నామినేటెడ్ పోస్టులు ఇవ్వడం ద్వారా రాజకీయంగా వారి సేవలకు గుర్తింపు ఇచ్చే అవకాశముంది. మొత్తం 18 మందితో ఏర్పాటయ్యే కమిటీలో 12మంది రైతులు, ఇద్దరు వ్యాపారులు మిగతా నలుగురు ప్రభుత్వ వర్గాల నుంచి ఉండనున్నారు. దీంతో ఏటా 14మందికి మార్కెట్ కమిటీ పాలకవర్గంలో స్థానం కల్పించడం ద్వారా రాజకీయంగా పదవులను ఇచ్చి సంతృప్తి పర్చవచ్చు.

నార్కట్‌పల్లి నుంచే అధిక ఆదాయం

నార్కట్‌పల్లి మండలానికి చెందిన 29 పంచాయతీలు చిట్యాల వ్యవసాయ మార్కెట్ పరిధిలో నేటికీ కొనసాగుతున్నాయి. చిట్యాల మార్కెట్ కమిటీ ప్రస్తుతం రూ.4కోట్ల వార్షిక ఆదాయంలో సింహభాగం నార్కట్‌పల్లి మండలం నుంచే సమకూరుతోందని రాజకీయ నాయకులు చెబుతున్నారు. అందుకే నార్కట్‌పల్లిలో సబ్ మార్కెట్ యార్డునైనా ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచే ఉంది. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో నార్కట్‌పల్లిలో సబ్ మార్కెట్ యార్డు ఏర్పాటుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. పట్టణంలో మాత్రమే ఏర్పాటు చేయాలనే వాదనతో ప్రభుత్వ స్థలం లేక సబ్ మార్కెట్ యార్డు ఏర్పాటు కాలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య చొరవతో సబ్ మార్కెట్ యార్డు మంజూరైంది.

పంచాయతీల పాలన అస్తవ్యస్తం

» ఏడాది కాలంగా నిలిచిన నిధులు » ఇబ్బందులు పడుతున్న కార్యదర్శులు

పల్లెల్లో అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయి. ఏడాదిన్నర కాలంగా గ్రామ పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులులేకపోవడంతో పల్లెలు నీరసించి పోతున్నాయి. గతేడాది ఫిబ్రవరి లో పంచాయతీ పాలకవర్గం గడువు ముగిసింది. అప్పటి నుంచి స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించకుం డా ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. అయితే నిధులలేమి కారణంగా ప్రత్యేకాధికారులు సైతం అంటిముట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి -నిడమనూరు)



ముప్పారం గ్రామ పంచాయతీ కార్యాలయం

పంచాయతీలకు పాలకవర్గాలు లేకపోవడంతో ప్రతి మూడు నెలలకోసారి విడుదలయ్యే 15వ ఆర్థిక సంఘం, ఎస్ఎఫ్‌సీ నిధులు నిలిచిపోయాయి. గతేడాది మార్చి నుంచి ఇప్పటివరకు కేంద్రం 15వ ఆర్థిక సంఘం నిధులు, ఇక రాష్ట్ర ప్రభుత్వం కూడా గతేడాది అక్టోబరు నుంచి ఎస్ఎఫ్‌సీ నిధులు విడుదల చేయలేదు. దీంతో పంచాయతీలు ఖాళీ ఖాజానాతో కనిపిస్తున్నాయి. కేవలం ఇంటి పన్నుల రూపంలో వచ్చే జనరల్ ఫండ్ మాత్రమే దిక్కైంది.

భారమంతా కార్యదర్శులపైనే...

పంచాయతీలకు పాలకవర్గాలు లేకపోవడం, ప్రభుత్వాలు నిధులు విడుదల చేయకపోవడం, ప్రత్యేకాధికారులు పట్టించుకోకపోవడం కారణంగా పంచాయతీల్లో పాలన భారమంతా కార్యదర్శుల పైనే పడుతుంది. ప్రభుత్వాలు నిధు లు విడుదల చేయకపోవడంతో కేవలం పన్నుల రూపంలో వచ్చే జనరల్ ఫండ్ నిధులతో గ్రామాల్లో ఎలాంటి పనులు చేయాలో తెలియక సతమతమవుతున్నారు. అభివృద్ధి పనుల విషయంలో ప్రజలకు సమాధానం చెప్పలేకపోతున్నారు. పారిశుధం, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, ట్రాక్టర్, నీటి ట్యాంకర్ నిర్వహణ భారంగా మారింది. ఉన్నతాధికారుల ఒత్తిడితో కార్యదర్శులు ఇబ్బందులు పడుతున్నారు. కొందరు కార్యదర్శులు పంచాయతీలో పనులకోసం అప్పులు చేస్తున్నామంటూ వాపోతున్నారు. కొందరు మానసిక ఒత్తిడికి గురవుతున్నారు.

పనుల విషయంలో రాజీ పడటం లేదు..



గ్రామ పంచాయతీలకు పాలకవర్గాలు లేకపోవడంతో పాటు ప్రభుత్వాలు నిధులు కూడా విడుదల చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. అయినప్పటికీ సమస్యల పరిష్కారం కోసం అన్ని చర్యలు తీసుకుంటున్నాం. పాలకవర్గాలు లేకున్నా పనుల విషయంలో రాజీ పడటం లేదు. పంచాయతీ నిర్వహణ కోసం కార్యదర్శులు రూ. 6 లక్షల వరకు అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టాం. ప్రభుత్వాలు నిధులు విడుదల చేయాల్సిన అవసరం ఉంది.

- లింగయ్య, తుమ్మడం, పంచాయతీ కార్యదర్శి

పల్లెల్లో పడకేసిన పారిశుధ్యం

» డ్రైనేజీల్లో పేరుకుపోయిన పూడిక » వ్యాధుల బారిన పడుతున్న ప్రజలు



గొడకొండ్ల(వీటీ నగర్) కాల్వల్లో పేరుకుపోయిన మురు

(ఆంధ్రజ్యోతి-చింతపల్లి) ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. వర్షాకాలం ప్రారంభమవడంతో గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరచాల్సి అధికారులు క్షేత్రస్థాయిలో దృష్టి సారించడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. డ్రైనేజీలో పూడికతీయకపోవడంతో ఘడియాగౌరారం, చాకిలిశేరుపల్లి, ఎం.మల్లేపల్లి, గొడకొండ్ల, పోలేపల్లి, రాంనగర్, కుర్మేడ్, వింజమూర్, రాయినిగూడెం, తదితర గ్రామాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రధానంగా నెలలతరబడి మురుగునీరు నిల్వ ఉండటంతో దోమలు-ఈగలు ప్రబలి ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలతో డ్రైనేజీలు పేరుకపోయి మురుగునీరు బయటకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. డ్రైనేజీలో బ్లీచింగ్ పౌడర్ చల్లక పోవడంతో పాటు గ్రామాల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేయడంలేదని, నీళ్ల ట్యాంకుల్లో క్లోరినేషన్ సక్రమంగా చేయడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు ప్రజా సమస్యలపై దృష్టి సా రించి నిరంతరం పర్యవేక్షించాలని, ప్రజల అవసరాలను గుర్తించి వాటి పరిష్కారానికి తగిన కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలి



వర్షాకాలం మొదలైన తరుణంలో ప్రజలకు సీజనల్ వ్యాధులు సోకే అవకాశం ఉంది. సీజనల్ వ్యాధులపై గ్రామాల్లోని ప్రజలకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి వ్యాధుల నివారణపై చర్యలు తీసుకోవాలి. ము రుగునీరు నిల్వ ఉండటంతో దుర్వాసన వస్తుంది. దోమలు-ఈగలు ప్రబలంతో వ్యాధులు సోకే ప్రమాదం పొంచి ఉంది. ఫాగింగ్ యాత్రల ద్వారా పిచ్చికారి చేయించాలి.

-శివర్ల రమేష్‌యాదవ్, చింతపల్లి

సమస్యల పరిష్కారానికి చర్యలు



గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను గుర్తించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలి. ప్రజలను ఇబ్బందులకు గురిచేసేలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటాం. ప్రతి గురువారం ప్రజావాణిలో శానిటేషన్, హెల్త్, ఇతర సమస్యలను అధికారుల దృష్టికి తీసుకవస్తే గ్రామకార్యదర్శులు తగిన కృషి చేయాలి.

- సుజాత, ఎంపీడీవో,చింతపల్లి

పేదలకు గూడు అందించాలన్నదే లక్ష్యం

● ఇప్పటికే నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు ● నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి



లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

హాలియా, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పేదలకు గూడు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి అన్నారు. శనివారం అనుముల మండలం హజారీగూడెం గ్రామంలో నిరుపేదలకు ఇళ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాగర్ నియోజకవర్గాన్ని విద్య, వైద్యం, సంక్షేమంలో ముందుంచడానికి నిరంతరం శ్రమిస్తున్నామని, ఇప్పటికే నియోజకవర్గంలో 3,500 ఇళ్లు మంజూరయ్యాయని, మరికొన్ని ఇళ్లు కూడా రెవెన్యూ మంత్రి శ్రీనివాస్‌రెడ్డి హామీ మేరకు రానున్నాయన్నారు. వాటిని కూడా అర్హులైన నిరుపేదలకు పంపిణీ చేస్తామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలించి పేదలను నిర్లక్ష్యం చేసిందని, ఒక్క ఇంటిని కూడా ఇవ్వలేక పోయిందన్నారు. కాంగ్రెస్ పాలనలో పూర్తి పారదర్శకతతో అర్హులైన అందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ఇక్కడ పట్టాలు పంపిణీ చేసిన స్థలంలో తన పేరుకు బదులు తమ నాన్నగారు అయిన జానారెడ్డి పేరును పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రఘు, మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు కుందూరు వెంకట్‌రెడ్డి, యడవల్లి నరేందర్‌రెడ్డి, రావుల రాంబాబు, మజారుద్దీన్, గౌని రాజారమేష్‌యాదవ్, వద్దిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రావుల శ్రీనివాస్, మట్టారెడ్డి, చిరంజీవులు, కుంటిగొర్ల శ్రీనివాస్, నాగెండ్ల శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ భవనానికి శంకుస్థాపన

అనుముల మండలం వీర్లగడ్డతండాలో నూతన గ్రామ పంచాయతీ భవనానికి గాను రూ.20 లక్షల మంజూరు కాగా, ఆ పనులకు శనివారం సాగర్ ఎమ్మెల్యే కందూరు జైవీర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తండాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఆయనవెంట నాయకులు కుందూరు వెంకట్‌రెడ్డి, గౌని రాజారమేష్‌యాదవ్, బాలునాయక్, నాగేందర్, అన్వరుద్దీన్, గౌస్ తదితరులు ఉన్నారు.

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు రద్దు చేయాలి

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల

మిర్యాలగూడ టౌన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): బీసీలకు నష్టం చేకూరుస్తున్న ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను వెంటనే రద్దు చేయాలని బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ డిమాండ్ చేశారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ రిజర్వేషన్ల అమలు సామాజికపరంగా ఉండాలని, ఆర్థిక పరమైన రిజర్వేషన్లు అమలు చేయడం సరి కాదన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లతో ఉపాధ్యాయ నియామకాల్లో బీసీ అభ్యర్థులకు అన్యాయం జరగ్గా, బాసర త్రిపుల్ ఐటీలో ప్రవేశాలలో బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులకు ప్రవేశం కలగడం లేదన్నారు. బీసీ హక్కులను భంగం కలిగించేలా ఉన్న ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు వెంటనే రద్దు చేయాలని, లేదంటే అన్ని కులాలకు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. సమావేశంలో సంఘం నాయకులు బంటు వెంకటేశ్వర్లు, ఎర్రబెల్లి దుర్గయ్య, దోనేటి శేఖర్, గుండెబోయిన నాగేశ్వరరావు, నాగరాజు, సైదులు, అంజి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై సీపీఐ పోరాటం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దేప సుదర్శన్‌రెడ్డి, నాయకులు

దేవరకొండ, జూలై 12(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కరానికి సీపీఐ ప్రజలపక్షాన నిరంతరం పోరాటాలు చేస్తుందని సీపీఐ దేవరకొండ మండల కార్యదర్శి దేప సుదర్శన్‌రెడ్డి అన్నారు. శనివారం దేవరకొండ సీపీఐ కార్యాలయంలో ఈ నెల 15న దేవరకొండలో జరగనున్న సీపీఐ జిల్లా మహాసభల కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. భారత కమ్యూనిస్టు పార్టీ వంద సంవత్సరాలు పూర్తి చేసుకొని ముందుకు వెళుతుందన్నారు. సీపీఐ జిల్లా మహాసభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి నూనె రామస్వామి, వలమాల ఆంజనేయులు, పల్లా రంగారెడ్డి, జూలూరి వెంకట్రాములు, షైనొద్దిన్, జ్యోతిబసు తదితరులు పాల్గొన్నారు.

పల్లెలకు బ్యాంక్ సేవలు



బ్యాంక్ శాఖను ప్రారంభిస్తున్న పరమశివం, సునీల్

హాలియా, జూలై12 (ఆంధ్రజ్యోతి): పల్లెలకు బ్యాంకు సేవలను మరింత చేరువ చేసేందుకు హాలియాలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ బ్రాంచ్ ఏర్పాటు చేసినట్లు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పరమశివం, జోనల్ హెడ్ సునీల్‌కుమార్ చుగ్ అన్నారు. శనివారం హాలియాలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ బ్రాంచ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ బ్యాంకు ద్వారా మారుమూల ప్రాంతాల ప్రజలకు రుణాలు మరింత సులభంగా అందించేందుకు తమ బ్రాంచ్‌ను ఇక్కడ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వ్యవసాయదారులు, వ్యాపారులకు అన్నిరకాల సేవలు అందించడమే లక్ష్యంగా తమ బ్రాంచ్‌ను ప్రజల ముందుకు తీసుకొచ్చినట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా స్థిరపడాలన్నారు. కార్యక్రమంలో సర్కిల్ హెడ్ అరవిద్, కల్రా, రైస్ మిల్లర్స్ జిల్లా గౌరవ అధ్యక్షుడు చిట్టిపోలు యాదగిరి, జనరల్ సెక్రటరీ వెంకన్న, వైస్ ప్రెసిడెంట్ నాని, కిషోర్, తీగల తిలక్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ల అమలుకు అడ్డంకులు తొలగించాలి





ఆర్. కృష్ణయ్యతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న పగిడి జీడయ్యయాదవ్, సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ

● ముఖ్యమంత్రిని కోరిన జీడయ్యయాదవ్

మిర్యాలగూడ టౌన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల అమలుకు అడ్డంకులు తొలగించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి కోరినట్లు బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడి జీడయ్యయాదవ్ తెలిపారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ రాజ్యసభ మాజీ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య సమక్షంలో సీఎంను కలిసి చట్టసభల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు నిర్ణయించడం పట్ల కృతజ్ఞతలు తెలిపామన్నారు. ఆర్డినెన్స్ రూపకల్పనకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. బీసీ హక్కుల సాధనకు ఆర్.కృష్ణయ్య చేసిన కృషి పట్ల సీఎం హర్షం వ్యక్తం చేశారన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్, కృష్ణయ్య చరిత్రలో నిలిచిపోతారన్నారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపినట్లు బీసీ విద్యార్థి సంఘ జిల్లా అధ్యక్షుడు గాదగోని మహేష్‌గౌడ్ తెలిపారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు అమలు చేయడం పట్ల మహేష్ హర్షం వ్యక్తం చేశారు.

బీసీ రిజర్వేషన్ల పెంపు చరిత్రాత్మక నిర్ణయం

బీసీ రిజర్వేషన్ల పెంపు చారిత్రాత్మక నిర్ణయమని కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి నీరుకంటి నారాయణ అన్నారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరులతో మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతులకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడం గొప్ప విషయమన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయడంతో పాటు ఇవ్వని హామీల అమలుకు శ్రీకారం చుడుతున్న తీరు ప్రశంసనీయమన్నారు. దశాబ్దకాలం రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం అడుగడుగునా బీసీలను వంచనకు గురి చేసిందన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా కాంగ్రెస్ తీసుకున్న సాహసోపేత నిర్ణయాన్ని అన్ని పార్టీలు స్వాగతించాలని, చట్ట సభల్లో బీసీల ప్రవేశానికి అడ్డుపడొద్దన్నారు. సమావేశంలో నాయకులు కుప్పాల సుబ్బారావు, పసుపులేటి శివ, ఎం.వెంకటేశ్వర్లు, నాగేంద్రబాబు, బాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.